ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 18 డిసెంబరు 2024



స్నాతకోత్సాహం



మంగళగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కేరింతలు.. వారి కుటుంబసభ్యులు, తల్లిదండ్రుల ఆనందోత్సాహాలు.. అతిరథులకు స్వాగత సత్కారాల మధ్య మంగళవారం మంగళగిరి ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సాధారణంగా స్నాతకోత్సవాలకు గవర్నర్ చాన్సలర్ హోదాలో పాల్గొంటారు. అయితే ఏకంగా రాష్ట్రపతి హాజరుకావడంతో ఈ వేడుకకు విశేషమైన ప్రాధాన్యం ఏర్పడింది. ఎయిమ్స్ స్నాతకోత్సవానికి చాన్సలర్ హోదాలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖమంత్రి జేపీ నడ్డా హాజరు కావాల్సి ఉండగా ఆ స్థానంలో ఆ బాధ్యతలను కేంద్ర ఆయుష్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావుజాదవ్ నిర్వర్తించారు. జాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో రాష్ట్రపతి నలుగురు విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. ఓవరాల్ అకడమిక్ టాపర్‌గా కేరళకు చెందిన లియా అజీ, బెస్ట్ మేల్ టాపర్‌గా ఏపీకి చెందిన దాసరి దివ్యాంశ్, బెస్ట్ ఫిమేల్ టాపర్‌గా పంజాబ్‌కు చెందిన సుప్రభసింహ, బెస్ట్ ఇంటర్నషిప్‌గా కేరళకు చెందిన వీకే అధీరా ప్రభృతులు బంగారు పతకాలను అందుకున్నారు. 47 మంది ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్లు, మరో నలుగురు పోస్ట్ డాక్టోరల్ సర్టిఫికెట్ కోర్సు విద్యార్థులకు కేంద్రమంత్రి ప్రతాప్‌రావ్‌జాదవ్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో కలిసి

(మిగతా 8వ పేజీలో)



వేడుకకు హాజరైన వైద్య విద్యార్థులు, కుటుంబసభ్యులు

- సంబరంగా ఎయిమ్స్ స్నాతకోత్సవం
- విద్యార్థులకు పట్టాలు అందజేసిన రాష్ట్రపతి
- మహిళా వైద్యుల శాతంపై ద్రౌపదిముర్ము హర్షం
- వైద్యులు చిత్తశుద్ధితో సేవకు ప్రాధాన్యమివ్వాలన్న రాష్ట్రపతి
- కేంద్ర సహాయమంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రి సమక్షంలో వేడుక
- ఎయిమ్స్‌లో ఇకపై మౌలిక సదుపాయాలకు లోటు రానివ్వం: చంద్రబాబు



స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రకాష్‌రావు జాదవ్, లోకేశ్, సత్యకుమార్ యాదవ్



రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న సీఎస్ నీరబ్‌కుమార్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, కలెక్టర్ నాగలక్ష్మి



8

అభిషేకాల అనంతరం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామికి విశేష అలంకారం

త్రికోటేశ్వరునికి మహారుద్రాభిషేకం

❖ జ్యోతి దర్శనంతో పులకించిన భక్తులు



పల్లెకోనలో నిర్మించిన ఆడిటోరియం

8

నటనకు తొలి మెట్టు రంగస్థలం

నాటకాలకు ఊపిరిపోస్తున్న పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్టు

పథకం ప్రకారమే చంపేసింది!

- సహకరించిన ప్రియుడు, నలుగురు మైనర్లు
- అన్నదమ్ముల హత్య కేసులో చెల్లిసహా ఆరుగురి అరెస్టు

3

కొండను తవ్వేస్తున్నారని కన్నెర్ర

తవ్వకాలను అడ్డుకున్న కొర్రపాటివారిపాలెం మహిళలు

పరిశీలించి అనుమతులు లేవని తేల్చిన మైనింగ్ అధికారులు

అద్దంకి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కొండను తవ్వేస్తూ గ్రావెల్‌ను తరలిస్తున్నారని తాళ్లూరు మండలంలోని కొర్రపాటివారిపాలెం మహిళలు మంగళవారం తవ్వకా లను అడ్డుకున్నారు. విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం పేరుతో కొర్రపాటివారిపాలెం సమీపం లోని కొండ మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. నెలరోజుల క్రితం కొర్రపాటివారిపాలెం రైతులు అడ్డుకోవడంతో గ్రావెల్ తరలింపును నిలిపేశారు. మళ్లీ నాలుగు రోజులుగా గ్రావెల్ తరలిస్తున్నారు. దీంతో కొర్రపాటివారిపాలెం గ్రామస్థులు సోమవారం మూకుమ్మడిగా వచ్చి అడ్డుకున్నారు. అయినా తాళ్లూరు పోలీసుల అండతో మరలా గ్రావెల్ తరలింపు ప్రారంభించగా మంగళవారం మహిళలు కొండ వద్దకు చేరుకుని గ్రావెల్ తరలింపును అడ్డుకున్నారు. పశువులు, జీవాలు మేతకు ఆధారంగా ఉన్న కొండ నుంచి ఎట్టి పరిస్థితుల్లో గ్రావెల్ తరిలింపునకు వీలులేదన్నారు. అద్దంకి మండల పరిధిలోని కొండ వద్ద తాళ్లూరు మండల పోలీసుల హడావుడి ఏమిటని ప్రశ్నించారు. గ్రామస్థుల ఆందోళన.. ఆంధ్ర జ్యోతిలో కథనంతో మంగళవారం బాపట్ల నుంచి వచ్చిన మైనింగ్ అధికారులు తవ్వకాలను పరిశీలించారు. గ్రావెల్ తరలింపునకు అనుమతులు లేవని తేల్చారు.



ఎక్స్‌కవేటర్, టిప్పర్ ముందు కూర్చున్న మహిళలు

చిరుజల్లులతో.. వణుకు

ఆందోళనతో అన్నదాతల పరుగులు

ధాన్యాన్ని భద్రపరుచుకుంటోన్న రైతులు



బాపట్ల : రోడ్డు పక్కన ఆరబోసిన ధాన్యాన్ని బస్తాలకు ఎత్తుతున్న రైతులు

రేపల్లె, కర్లపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నూర్పిళ్లు చేసి ఆరబెట్టుకున్న రైతులను చిరుజల్లులు పరుగులు పెట్టిస్తున్నాయి. వరికోతలు ముంచుకొస్తు న్న తరుణంలో బంగాళాఖాతంలో వాయుగుండంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే చాలాదగ్గర్ల యంత్రాలతో కోతలు జరగ్గా ఆ ధాన్యాన్ని రైతులు పొ లాలు, సమీపంలోని రహదార్లపై ఆరబోసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం వర్షం పడటంతో ధాన్యాన్ని భద్రపరుచుకునేందుకు రైతులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. వాయుగుండం నట్టేట ముంచేస్తుందని రైతులు కంటిమీద కునుకు లేకుండా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కర్లపాలెం మండలంలో అక్కడక్కడ చిరుజల్లులు కురియడంతో ధాన్యం రాశులపై కొందరు రైతులు పట్టాలు కప్పగా, మరికొందరు బస్తాలకు ఎక్కించి సురక్షిత ప్రాంతా లకు తరలించారు. ఎచ్చిపచ్చిగా ఉన్న పనలను సైతం కుప్పలుగా వేశారు. వారం రోజులు వర్షం లేకుంటే పంటంతా ఇంటికి చేరుతుందని రైతులు తెలుపుతున్నారు.



రేపల్లె : వర్షంతో ధాన్యం రాశులపై పట్టాకప్పుకుంటున్న రైతులు



సంతమాగులూరు : కొమ్మాలపాడు డీసీకి ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ధ్రువీకరణ పత్రం అందజేత

డీసీలు ఏకగ్రీవం

- జిల్లాలో 22 కమిటీలకు ఎన్నిక పూర్తి
- ఒక్కటి మినహా అన్నీ ఏకగ్రీవమే
- ఈ నెల 21న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నిక

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణలో రెండో అంకమైన డీసీ(డిస్ట్రిబ్యూటరీ కమిటీ)ల ఎన్నికలను మంగళవారం అధికారులు పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 22 డీసీలు ఉండగా ఒక్కటి మినహా అన్ని ఏకగ్రీవమయినట్లు అధికారులు ప్రకటించారు. జిల్లాలో కెడబ్ల్యూడీ పరిధిలో 14 డీసీలు ఉండగా, ఎన్‌ఎస్‌పీ కింద 8 డీసీలు ఉన్నాయి. వీటన్నింటికి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకునే ప్రక్రియను యంత్రాంగం పూర్తి చేసింది. ఈనెల 21న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నిక జరగనుంది. ఈ ప్రక్రియలో ఇప్పుడు డీసీ నుంచి ఎన్నికయిన వారు ఓటింగ్‌లో పాల్గొని చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. డబ్ల్యూయూఏలకు ఈ నెల 14న జరిగిన ఎన్నికలలో 170 సాగునీటి సంఘాలకు ఏకగ్రీవంగా అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక జరిగిన సంగతి విదితమే. తర్వాత దశలో భాగంగా డీసీలకు ఎన్నికను కూడా అధికారులు పూర్తి చేశారు.

ఒక్కటి మినహా అన్నీ ఏకగ్రీవమే...

మండలాల వారీగా నిర్దేశించిన ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళ వారం ఉదయం తొమ్మిదింటి నుంచే డీసీల అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఇందుకోసం 15 నిమిషాల సమయం కేటాయించిన యంత్రాంగం తొమ్మిదిన్నరకు పోటీలో ఉండే వారి పేర్లను ప్రకటించి ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 22 డీసీలు ఉండగా 47 వ నంబరు డీసీకే మాత్రం ఎన్నిక నిర్వహించగా మిగిలినవన్నీ కూడా ఏకగ్రీవాల బాటే పట్టాయి. ఎన్నిక జరిగిన 47 డీసీ పరిధిలో మొత్తం ఆరుగురు ఓటు హక్కు వినియోగించుకోగా ఇరువురికి చెరి మూడు ఓట్లు వచ్చాయి. ఫలితం కోసం అధికారులు డ్రా తీయగా అప్పికట్లకు చెందిన శ్రీకాంత్‌ను డీసీ అధ్యక్ష పదవి వరించింది. 21 డీసీలకు అధ్యక్ష ఉపాధ్యక్ష పదవులన్నీ ఏకగ్రీవమయినట్లు అధికారులు ప్రకటించడంతో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన డీసీల ఎన్నిక కూడా ముగిసినట్లైంది.

సంక్రాంతికి సాధ్యమేనా?

456 రోడ్లకు 19 పనులే పూర్తి


- వారం లక్ష్యాలు నిర్దేశించినా విఫలం
- పనులపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నత్తనడకన గుంతల రహిత రహదారుల పనులు
- గుంతల రహదారులతో వాహనచోదకుల ఇక్కట్లు

నత్తతో పోటీ...

- గుంటూరు జిల్లాలో 134 ప్యాకేజీల్లో చేపట్టిన గుంతల పూడ్చివేత పనులకు రూ.28.94 కోట్లు మంజూరయ్యాయి. అయితే రూ.10.24 కోట్లతో 10 పనులు చేపట్టగా రూ.3.03 కోట్ల విలువైన ఒక్క ప్యాకేజీలోని పని మాత్రమే పూర్తిచేశారు. 535 కిలోమీటర్ల మేర రహదారుల్లో పనులు చేపట్టగా ఇప్పటికి 69.40 కిలోమీటర్లల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు.
- పల్నాడు జిల్లాలో రూ.38.56 కోట్లతో 910 కిలోమీటర్లలో 124 పనులు మంజూరు చేశారు. వీటిలో 170.50 కిలోమీటర్ల మేర 18 ప్యాకేజీల్లో రూ.2.82 కోట్ల పనులు మాత్రమే పూర్తి అయ్యాయి.
- బాపట్ల జిల్లాలో 708.50 కిలోమీటర్లలో గుంతల పూడ్చివేత పనులను 198 ప్యాకేజీలుగా విభజించారు. రూ.46.79కోట్లతో పనులు చేపట్టగా ఇప్పటికి 55.02 కిలోమీటర్ల రోడ్లపై గుంతలు పూడ్చివేశారు. ఒక్క ప్యాకేజీలో కూడా పూర్తిస్థాయిలో పనులు పూర్తికానట్లు ప్రభుత్వ నివేదికలు తెలియజేస్తున్నాయి.

జానపాడు రహదారిలో గుంతలు





వనికుంట ప్రాంతంలో గుంతలు

పనులు పురోగతి ఇలా..

జిల్లా	మంజూరు	చేపట్టినవి	పూర్తయినవి
పల్నాడు	124	38	18
బాపట్ల	198	29	నిల్
గుంటూరు	134	19	1

గోతుల రహదారులు సంక్రాంతి నాటికి కనిపించవు.. వైసీపీ హయాంలో ప్రజలు గుంతల రోడ్లతో పడిన ఇబ్బందులు ఇక ఉండవు.. అని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. గత నెలలో గుంతల రహిత రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పనులు చేపట్టేందుకు పెద్ద ఎత్తున నిధులు కూడా మంజూరు చేసింది. ఆర్భాటంగా పనులను ప్రజాప్రతినిధులు ఎక్కడికక్కడ ప్రారంభించారు. అయితే కొన్ని దగ్గర్ల శరవేగంగా పనులు జరుగుతుండగా చాలాప్రాంతాల్లో గుంతల పూడ్చివేత పనులు అరకొరగా.. నత్తనడకన సాగుతున్నాయి. పనులు సాగుతున్న తీరును చూస్తే సంక్రాంతి నాటికి గోతుల రహిత రహదారుల లక్ష్యం అసాధ్యంగా కనిపిస్తోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో రోడ్ల పనులను 456 ప్యాకేజీలుగా విభజించి మరమ్మతులు చేపట్టగా ఇప్పటికి 19 పనులే పూర్తి చేశారు. దీనినిబట్టి ప్రభుత్వ లక్ష్యంపై అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రధాన రహదారుల నుంచి సందుగొందుల్లోని రోడ్ల వరకు గోతుల మయం. వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్ల అభివృద్ధి కాదు కదా.. కనీసం గుంతలు పూడ్చాలన్న ఆలోచన చేయలేదు. దీంతో గుంతల రహదారులతో ప్రమాదాలు తరచూ జరగడం.. మరణాలు, గాయపడటం వాహన చోదకులకు పరిపాటిగా మారింది. ఈ పరిస్థితుల్లో ప్రజలు రోడ్డెక్కాలంటే వణికిపోవాల్సి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు రహదారులను విస్మరించగా కూటమి ప్రభుత్వం రోడ్లపై దృష్టిసారించింది. రహదారులను అభివృద్ధి చేస్తామని, గుంతలు లేని రహదారులను నిర్మిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే అధికారం చేపట్టిన తర్వాత కూటమి ప్రభుత్వం గుంతల రహిత రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పెద్దఎత్తున నిధులు మంజూరు చేసి సంక్రాంతి కల్లా గుంతలు లేని రహదారులను తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే పనులు చేపట్టి నెల దాటుతున్నా.. ప్రభుత్వ లక్ష్యాలు

(మిగతా 8వ పేజీలో)



వక్ఫ్‌బోర్డు చైర్మన్‌కు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే నసీర్

‘వక్ఫ్’ ఆస్తుల పరిరక్షణకు కంచెలా పని చేస్తాం: ఎమ్మెల్యే

గుంటూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు కంచెలా పని చేస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, వక్ఫ్ బోర్డు సభ్యుడు మొహమ్మద్ నసీర్ అన్నారు. విజయవాడలోని వక్ఫ్ బోర్డు రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన చైర్మన్ ఎంపిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. నసీర్ తో పాటు మిగిలిన సభ్యులు చైర్మన్‌గా అబ్దుల్ అజీజ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చట్ట నిబంధనలకు అనుగుణంగా నూతన కార్యవర్గం పని చేస్తుందని, సంస్థను మరింత బలోపేతం చేసేందుకు, సంస్థ అభివృద్ధికి కొత్తదారులు ప్రణాళికలతో కమిటీ ముందుకు వెళుతుందని తెలిపారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కంచెలాగా పని చేస్తామన్నారు. ఈ కమిటీ వినూత్న వ్యూహాలను అమలు చేయడంలో, కమ్యూనిటీతో సహకారం పెంపొందించడంలో, ప్రత్యేక లక్ష్యం సాధనలో కీలకమైన పాత్ర పోషిస్తుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ముస్లింల ఆత్మ గౌరవం కాపాడటమే లక్ష్యంగా పని చేస్తోందని తెలిపారు. మైనారిటీల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి పాటుపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సభ్యులు తమీమ్ అన్సారీయా ఐఏఎస్, హాజీ ముక్రం హుస్సేన్, సయ్యద్ దావూద్ బాషా, షేక్ అక్రమ్, అఫియా, షేక్ ఖాజా మొహిద్దిన్ మోతవల్లి, మహమ్మద్ ఇస్మాయిల్ బేగ్, వక్ఫ్ సీఈఓ అబ్దుల్ ఖాదిర్ పాల్గొన్నారు.

19న బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు ఎన్‌సీసీ కోటా కౌన్సెలింగ్

గుంటూరు సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్ కోర్సు ఎన్‌సీసీ కోటా కౌన్సెలింగ్ ఈ నెల 19న నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ జీ రామచంద్రరావు తెలిపారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

విదర్భ 205 పరుగులకు ఆలౌట్



ఓం ధోత్రే (70 పరుగులు)

మంగళగిరి సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో రాజస్థాన్, విదర్భ జట్ల మధ్య మూడు రోజుల మ్యాచ్ మంగళవారం ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విదర్భ జట్టు 73.4 ఓవర్లలో 205 పరుగులు చేసి ఆలౌట్ అయింది. విదర్భ బ్యాటర్లు ఓం ధోత్రే 12 ఫోర్లతో 70 పరుగులు, కశ్యప్ 35 పరుగులు చేశారు. రాజస్థాన్ బౌలర్లు పురు దేవద్వాల్, సుజల్ పార్మర్, ఆదిత్య వాద్వా మూడేసి వికెట్లు చొప్పున తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్‌లో బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ జట్టు ఆట ముగిసే సమయానికి 5 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 4 పరుగులు చేసింది.

ఆక్రమణలు, భూ సమస్యలపై వినతులు

- 52వ రోజు ‘ప్రజాదర్బార్’లో అర్జీలు స్వీకరించిన మంత్రి లోకేశ్



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న అర్జీదారులు

తాడేపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యతో ఒకరు, పథకాలు ఇప్పించాలని మరొకరు భూ సమస్యలతో కొందరు.. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు అర్జీదారులు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీదారులు మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. 52వ రోజు ప్రజాదర్బార్ మంగళవారం అర్జీదారులతో కిటకిటలాడింది. మంత్రి లోకేశ్‌ను ఆయన నివాసంలో కలిసిన అర్జీదారులు తమ వినతిపత్రాలు సమర్పించారు.

ఆప్షన్ 2 అమలు చేయండి

చీరాల ఓడరేవు నుంచి నకిరేకల్లు వరకు 167ఏ నాలుగు లేన్ల జాతీయ రహదారిని ఎన్‌హెచ్‌ఏ అధికారులు 2022లో ప్రతిపాదించారు. ఇందులో అంతర్భాగంగా ఉన్న నర్సరావుపేట బైపాస్ నిర్మాణానికి మూడు ఆప్షన్లు ఇచ్చారు. ఇందులో నరసరావుపేట దక్షిణం వైపు బైపాస్‌కు ప్రతిపాదించిన ఆప్షన్ 3 వల్ల ఐదు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున రైతులు నష్టపోవాల్సి వస్తుంది. రైతులకు తక్కువ నష్టం కలిగించే ఆప్షన్ 2ను అమలు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే అరవిందబాబు నేతృత్వంలో మంత్రి లోకేశ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

కుదువపెట్టిన బంగారం ఇవ్వట్లేదు

కరోనా సమయంలో తన బిడ్డ వైద్యం కోసం కుదువ పెట్టిన బంగారాన్ని ఇవ్వకుండా తన మేనమామ వేధిస్తున్నాడని జగ్గయ్యపేట నియోజకవర్గం తోటచర్లకు పద్మావతి ఆవేదన వ్యక్తం చేసింది. 120 గ్రాముల బంగారాన్ని మేనమామ వెంకటేశ్వరరావు వద్ద కుదువపెటి రూ.3 లక్షలు అప్పు తెచ్చి వైద్యం చేయించినా బిడ్డ బతకలేదని 2019లో రెండవ బిడ్డ యాక్సిడెంట్‌లో చనిపోయాడని పేర్కొన్నారు. తాను అప్పుగా తీసుకున్న డబ్బులు ఇస్తానన్నా కుదువపెట్టిన బంగారం తిరిగి ఇవ్వడం లేదని, పోలీసు అధికారులకు చెప్పినా న్యాయం జరగలేదని లోకేశ్‌కు విన్నవించారు.

పింఛన్ ఇప్పించండి

పుట్టుకతో తీవ్ర అనారోగ్యంతో జన్మించిన తన బిడ్డకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బద్వేలుకు చెందిన కొండమ్మ విన్నవించింది. ఒళ్లంతా పొక్కులతో కొలేడన్ బేబీగా జన్మించిన తన బిడ్డకు తమిళనాడులోని కంచి కామకోటి హాస్పిటల్‌లో రూ.17లక్షలు ఖర్చు చేసినా ప్రయోజనం లేకపోయిందని, కలెక్టర్‌కు విన్నవిస్తే కడప రిమ్స్‌కు రాశారని, అక్కడ కూడా సరైన మందులు ఇవ్వడం లేదని తెలిపారు. ప్రైవేటుగా కొనుగోలు చేస్తే నెలకు రూ.10 వేలు ఖర్చు అవుతుందని, రెక్కాడితేగాని డొక్కాడని తమకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. మరో వినతిలో.. యాక్సిడెంట్ తరువాత కోమాలోకి వెళ్లిన బిడ్డ వైద్యానికి రూ.18 లక్షలు ఖర్చు చేసిన ప్రయోజనం లేదని, ఇప్పటికీ వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడని, డ్రైవర్‌గా ఉన్న తాను పక్షవాతానికి గురయ్యానని, తన కుటుంబాన్ని ఆదుకోవాలని మైదుకూరు ప్రాంతానికి చెందిన అశోక్ విన్నవించారు.

బిల్లుల చెల్లింపుపై వినతి

వైసీపీ నేతల అండతో ఓ వ్యక్తి విశాఖలోని తమ స్థలాన్ని ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నాడని తెనాలి నియోజవర్గం మోపర్రుకు చెందిన కృష్ణప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీ భవన నిర్మాణానికి సంబంధించి బిల్లులు చెల్లించి ఆదుకోవాలని గారపాడుకు చెందిన మేస్త్రీ వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. 2018లో ముట్లూరులో రెండు, గారపాడులో ఒకటి, అంగన్వాడీ భవనాలు నిర్మించి రూ.30 లక్షలు వెచ్చిస్తే ఆనాటి టీడీపీ ప్రభుత్వం రూ.11 లక్షలు ఇచ్చిందని, వైసీపీ వచ్చాక ఐదేళ్లు తిప్పించుకుని రూ.4లక్షలు ఇచ్చారని, వైసీపీ రంగులు వేయడానికి మరో ఆరు లక్షలు ఖర్చు చేయించారని కలెక్టర్ చుట్టూ తిరిగినా ఉపయోగం లేదని, అప్పుల పాలైన తనకు బిల్లులు నగదు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. రోడ్డు పేరుతో తమ ఇళ్లు తొలగించవద్దంటూ ఈ-11 రోడ్డు ఇళ్ల బాధితులు సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవితో ప్రజాదర్బార్‌కు విచ్చేసి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల నుంచి వినతిపత్రాలను స్వీకరించిన లోకేశ్ వారికి అండగా ఉంటానని, అధైర్యపడొద్దని హామీ ఇచ్చారు.

దాతృత్వానికి ప్రతీక డాక్టర్ పీవీజీ రాజు

- శతజయంతి వేడుకల్లో మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు



పాటిబండ్ల విష్ణువర్ధన్‌ను సత్కరిస్తున్న అశోక్ గజపతిరాజు, బుద్ధ ప్రసాద్, గజల్ శ్రీనివాస్, లక్ష్మణ్ రెడ్డి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ పీవీజీ రాజు మంచి మనసున్న మహారాజు అని, దాతృత్వానికి నిలువుటద్దమని, అలాంటి కుటుంబంలో జన్మించే అవకాశం కలగడం భగవంతుడు అందించిన వరం అని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి. అశోక్ గజపతిరాజు అన్నారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాక్టర్ పీవీజీ రాజు శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అశోక్ గజపతిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీజీ రాజు విద్యా పురస్కారాలను శారదా నికేతన్ వ్యవస్థాపకులు ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీ బాయమ్మ దంపతుల వారసురాలు వీ హేమ, పాటిబండ్ల సీతారామయ్య హై స్కూల్ వ్యవస్థాపకులు పాటిబండ్ల సీతారామయ్య మనుమడు పాటి బండ్ల విష్ణువర్ధన్‌కు, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ (హీల్) వ్యవస్థాపకులు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్‌కు అశోక్ గజపతిరాజు చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ఎదిగే కొద్ది అహం పెంచుకోవద్దని, సమయపాలన పాటించాలని, సాధారణ వ్యక్తులుగా క్రమశిక్షణతో పెరగాలని చెప్పిన తన తండ్రి మాటలను గౌరవిస్తూ జీవిస్తున్నట్లు చెప్పారు. ప్రాథమిక విద్య మాతృ భాషలో ఉండాలని అన్నారు. గత ప్రభుత్వం ప్రాథమిక విద్యలో మాతృభాషను తొలగించడం వలన 10 లక్షల మంది బాలబాలికలు విద్యకు దూరమయ్యారని, వేలాది పాఠశాలలు మూతపడ్డాయని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర రాజధానిని తాకట్టు పెట్టిందని, విమర్శించారు. ఒట్టి మాటలకే పరిమితమైన రాజకీయ వ్యవస్థను నిర్మూలించాలన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పీవీజీ రాజు ఐదుసార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు లోక్‌సభ సభ్యునిగా, ఆంధ్ర ప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా పని చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి మాట్లాడుతూ ఉత్తర కోస్తా జిల్లాలలో విజయనగర రాజుల నుంచి ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని మేలు పొందని వారు లేరన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ నేడున్న రాజ కీయ నేతలు పీవీజీ రాజును ఆదర్శంగా తీసుకుని నిరాడంబరంగా, నిజా యితీతో పనిచేయాలన్నారు. ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్ ప్రసంగిస్తూ పీవీజీ రాజు 250 ఎకరాల విస్తీర్ణంలో గల తన ప్యాలె స్‌ను కోరుకొండ సైనిక్ స్కూల్‌కి విరాళంగా ఇచ్చి భారతదేశంలో మొదటి సైనిక్ స్కూల్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. పెనుమెత్స నాగరాజు సహకారంతో ప్రచురించిన పూసపాటి రాజుల యొక్క పూర్వో త్తరం చారిత్రిక గ్రంథాన్ని అశోక్ గజపతిరాజు ఆవిష్క రించారు. తొలుత పీవీజీ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ‘మాన వత’ నేతలు పావులూరి రమేష్, టీ ధనుంజయరెడ్డి, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ ఫీల్డ్ ఆఫీసర్ షేక్ జానీ రసూల్, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఇండియన్ టొబాకో అసోసియేషన్ కార్యదర్శి యార్లగడ్డ చౌదరి పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు, సీఐ సురేష్, ఎస్సై వేణుగోపాల్, పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులు (ముసుగులో)

రాజుపాలెం,డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): గంజాయిని పూర్తి స్థాయిలో నిర్మూలించాలంటే ప్రజల సహకారం అవసరమని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు అన్నారు. మండల కేంద్రమైన రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి నిర్మూలనపై గ్రామ స్థాయిలో, కళాశాలలో, పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో గంజాయిని విక్రయిస్తున్నారని, గంజాయికి ఎనిమిదో తరగతి విద్యార్థులు అలవాటు పడటం బాధ కలిగిస్తోందన్నారు. గంజాయి సేవించిన వారు ఎలా ప్రవర్తిస్తారో వారికే తెలియదన్నారు. మీ ప్రాంతాలలో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే కనుక సమీపంలోని పోలీస్‌స్టేషన్లో గానీ, 100కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. గంజాయి విక్రయదారుల అరెస్టు విషయం విలేకరులకు తెలిపారు. మండలంలోని చౌటపాపాయపాలెంలో సోమవారం సాయంత్రం రైల్వేగేటు దగ్గర క్రోసూరు మండలం పారుపల్లికి చెందిన పారుపల్లి భూలక్ష్మీ చౌటపాపాయపాలెంకు చెందిన కుందూరు దుర్గారావు, వల్లాల ప్రసాదులకు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు మెరుపుదాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారివద్ద ఉన్న సుమారు 2కెజీల గంజాయి, 2 సెల్‌ఫోన్లు, రూ.3100నగదు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జూనియర్స్ విభాగంలో బాపట్ల ఎడ్ల జతకు ప్రథమ స్థానం



జూనియర్స్ విభాగంలో ప్రథమస్థానం సాధించిన బాపట్ల ఎడ్ల జత

గురజాలటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని పట్టణంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో భాగంగా మంగళవారం జూనియర్స్ విభాగంలో పోటీలు జరిపారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత నిర్ణీత సమయంలో 4000 అడుగుల దూరం బండ లాగి ప్రథమస్థానంలో నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎడ్ల జత 3900.5 అడుగులతో రెండోస్థానం, హుజూర్‌నగర్‌కు చెందిన సుంకీ సురేంద్రరెడ్డి ఎడ్లజత 3831 అడుగులతో మూడో స్థానం, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన జత 3804.6 అడుగులతో నాలుగో స్థానం, హైదరాబాద్‌కు చెందిన ఎడ్లజత 3723.2 అడుగులతో ఐదో స్థానంలో నిలిచాయి.

56,204 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 59,536 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 56,202 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 46,133 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14500	334	7500	14500
నెంబరు. 5	8000	12500	నెంబరు.5	8000	12000
273	12000	12000	273	8500	11500
341	8000	15000	341	7500	14000
4884	9000	10000	4884	10500	14200
సూపర్ 10	-	-	సూపర్ 10	10000	15200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16300	తేజ	7500	16500
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	8000	14000
దేవనూరు డీలక్స్	9500	15000	దేవనూరు డీలక్స్	9000	13000
తెలకాయలు	4000	11500	తెల్లకాయలు	4500	11000

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 579.60 అడు గులు ఉంది. ఇది 281.85 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7086 క్యూసెక్కులు, ఎడమకాలువ ద్వారా 7852 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 17,638 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 17,638 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- ఇసుక రీచ్‌ని పరిశీలించిన విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణ్‌కుమార్



మున్నంగి ఇసుకరీచ్‌ని పరిశీలిస్తున్న రీజనల్ విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణ్‌కుమార్, మైనింగ్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొల్లిపర, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ‘ఉచితమన్నా దోపిడీనే’ అనే శీర్షికను ‘ఆంధ్రజ్యోతి’లో ఆదివారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణకుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్, మైనింగ్, రెవెన్యూ అధికారులు మంగళవారం మండల పరిధిలోని మున్నంగి ఇసుకరీచ్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుకలోడింగ్ చేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించి అక్కడ కూలీలను వాహనాలకు లోడింగ్ చేసినందుకు నిర్వాహకులు ఎంత ఇస్తున్నారు, కృష్ణానదిలో యంత్రాల ద్వారా ఏమైనా లోడింగ్ చేస్తున్నారా, లోడింగ్ చేసినందుకు ప్రభుత్వం ఇచ్చిన ధర కన్నా అధికంగా వసూళ్లకు పాల్పడుతున్నారా అనే విషయాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూర్యశ్రావణకుమార్ మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల్లో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. కృష్ణానదిలో యంత్రాల ద్వారా లోడింగ్ చేసిన, అధికంగా వసూళ్లు చేసినా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుకరీచ్‌ని తనిఖీ చేసిన వారిలో విజిలెన్స్ సీఐలు కొమ్మాలపాటి చంద్రశేఖర్, పీ శివాజీ, మైనింగ్ అధికారి కావ్య ఉన్నారు.

మళ్లీ పరుగులెత్తనున్న ‘పోలవరం’: కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పర్యటనతో పోలవరం ప్రాజెక్టు పనులు మళ్లీ పరుగులెత్తనున్నాయని టీడీపీ పల్నాడు జిల్లా అధ్య క్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన ‘పోల వరం’, రాజధాని అమరావతి రెండు కళ్ళు వంటివని, గత ఐదేళ్లుగా ఈ రెండు నిర్లక్ష్యానికి గురవడమే కాకుండా సర్వ నాశనం చేశారని విమర్శించారు. ఈ రెండింటిని మళ్లీ ట్రాక్‌పైకి తీసు కొచ్చేందుకు చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. పోలవరం ప్రాజెక్టును త్వరి గతిన పూర్తి చేసేందుకు కేంద్ర జల సంఘం, పోలవరం అథారిటీతో చర్చలు జరిపి దిశానిర్దేశం చేశారని, ఈ ప్రాజెక్టు పూర్తి చేసి నదుల అనుసంధానంతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో పని చేస్తున్నారన్నారు.

పాతగుంటూరు శివార్లలో యువకుడి హత్య

- డబ్బు విషయమై మద్యం మత్తులో దాడి
- పరారీలో ఐదుగురు నిందితులు



హత్యకు గురైన దీపక్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పాత గుంటూరు శివా ర్లలో యువకుడు హత్యకు గురైన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. స్థానిక పాత గుం టూరు పోలీసుల కథనం ప్రకారం, తెనాలి చెంచు పేటకు చెందిన యువ కుడు చప్పిడి దీపక్ (25) మద్యానికి బానిసయ్యాడు. కొంతకాలం విశాఖపట్నంలో నివసించిన అతను, అనా రోగ్య సమ స్యలు తలెత్తడంతో తిరిగి తెనాలికి వచ్చాడు. గుంటూరులోని ఎస్వీఎన్ కాలనీకి చెందిన యువకుడు గద్దల కిరణ్‌తో స్నేహం ఏర్పడింది. వీరిద్దరూ తరచుగా మద్యం తాగేవారు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరిలో కిరణ్ ఫోన్ పే నుంచి రూ. 50 వేలు, దీపక్ తన ఫోన్ పే కి కొట్టుకున్నాడు. ఈ విషయం తెలుసు కున్న కిరణ్, తన డబ్బులు తనకు తిరిగి ఇవ్వమని దీపక్‌ను పలుమార్లు అడిగాడు. డబ్బులు ఇవ్వకుండా దీపక్ వాయిదా వేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం వాళ్లిద్దరూ తెనాలిలో మద్యం తాగారు. గత రాత్రి వీళ్లిద్దరూ గుం టూరులో కలుసుకుని మద్యం తాగాలని నిర్ణయించుకున్నారు. స్థానిక పాత గుంటూరుకు చెందిన తన స్నేహితులు శివశం కర్, అశోక్, గోపి, అక్బర్‌లను వెంటబెట్టుకొని వెళ్లిన కిరణ్, శివారు ప్రాంతాల్లోని రాజీవ్ గృహకల్ప వద్ద అర్ధరాత్రి వరకు మద్యం తాగారు. ఈ క్రమంలో దీపక్, కిరణ్‌ల మధ్య డబ్బు వివాదం జరిగింది. తనకు డబ్బులు ఇవ్వాలని కిరణ్ గట్టిగా నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది, కిరణ్, తన వెంట వచ్చిన వారు కలిసి దీపక్ పై దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన దీపక్ ను వైద్య చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఆటో మాట్లాడి తరలించారు. అయితే, ఆటో డ్రైవర్‌కి దీపక్ పేరును వెంకటరెడ్డి అని చెప్పి పంపించారు. జీజీహెచ్‌లో చేర్పిన ఆటో డ్రైవర్, క్షతగాత్రుడు పేరుని వెంకట్ రెడ్డి అని నమోదు చేయించారు. చికిత్స పొందుతున్న దీపక్ తెల్లవారుజామున మృతి చెందాడు. దీపక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులు పరారీ లో ఉన్నట్లు పాత గుంటూరు పోలీసులు తెలిపారు.

భర్తకు జైలు, జరిమానా

నరసరావుపేట లీగల్, డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి) : భార్య మృతికి కారకుడైన భర్తకు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. ఈ మేరకు స్థానిక అదనపు సహాయ సెషన్స్ న్యాయమూర్తి కే మధుస్వామి మంగళవారం తీర్పునిచ్చారు. పద్దెనిమిదేళ్ల క్రితంచిలకలూరిపేటకి చెందిన దేశవత్ హనుమంతరావు నాయక్ వివాహం రమణ బాయితో జరిగింది. 2000 సంవత్సరం నుంచి మద్యానికి బానిసైన హనుమంతరావు తన భార్యను వేధించేవాడు. ఈ క్రమంలో 2021 నవంబరు 30న ఎలుకల మందు తీసుకుని రమణబాయి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న చిలకలూరిపేట పట్టణ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టుతీర్పు వెలువడింది. శిక్ష మొత్తాన్ని ఏకకాలంలో అనుభవించేలా న్యాయ అధికారి తీర్పులో పేర్కొన్నారు.

ఎల్ఎల్ఎం, ఎల్ఎల్‌బీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

పెదకాకాని, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాలలో ఉన్న ఎల్ఎల్ఎం, కోర్సుతోపాటు బీఏ ఎల్ఎల్‌బీ బీబీఏ ఎల్ఎల్‌బీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులకు ఈ నెల 23న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ పీ బ్రహ్మజీరావు మంగళవారం తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవే శాలు పొందేందుకు ఏపీ లా సెట్/ పీజీ లా సెట్ 2024 లో ర్యాంకులు సాధించిన వారికి మాత్రమే ప్రవేశాలు కల్పించ నున్నట్లు స్పష్టం చేశారు. ఈ కోర్సులలో ప్రవేశాలు పొందే అభ్యర్థులు 23 ఉదయం 10 నుంచి 12 గంటల వరకు రిజి స్ట్రేషన్ చేసుకోవాలని సూచిం చారు. ఎల్ఎల్ఎం కోర్సులో ఇంటర్నల్ స్లైడింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18న ఉదయం 10 నుంచి 2 గంటల వరకు వర్సిటీ లోని ఆర్ట్స్ కళాశాలలో ఈ ఇంటర్నల్ స్లైడింగ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107.115.126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు విక్రయిస్తే చర్యలు

● మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు

బాపట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు విక్రయించినా, వినియోగించిన చర్యలు తప్పవని మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని జీబీసీ రోడ్డులోని గడియార స్తంభం సెంటర్ కూడలిలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. జయలక్ష్మి ట్రేడర్స్‌లో క్యారీబ్యాగ్‌లు గుర్తించి స్వాధీనం చేసుకొని రూ.5 వేల జరిమాన విధించారు. అదేవిధంగా పబ్బిశెట్టి హేమంత్‌కుమార్ దుకాణంలో తనిఖీలు నిర్వహించి క్యారీబ్యాగ్‌లు స్వాధీనం చేసుకొని రూ2,500 జరిమాన విధించారు. మొత్తం 86 కిలోల క్యారీబ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నిషేధించిన క్యారీబ్యాగ్‌లను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ, సిబ్బంది ముస్తఫా, దుర్గా పాల్గొన్నారు.

అగ్నిబాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ చేయూత

బాపట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 6వవార్డులో సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాన్ని మంగళవారం బాపట్ల రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి గృహోపకరణాలు, టార్పాలిన్ పట్టా, దుప్పట్లు, దుస్తులు అందజేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుందని సభ్యులు రమణ బాబు, జె.సత్యనారాయణరాజు తెలిపారు.

ప్రథమ బ్యాచ్‌కు ముగిసిన శిక్షణ కార్యక్రమం

పిట్టలవానిపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సుస్థిరాభివృద్ధి లక్ష్యాల రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రథమ బ్యాచ్‌కు మంగళవారంతో ముగిసిందని పిట్టలవానిపాలెం మండల ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు తెలిపారు. ఈ రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై 9 టీమ్స్‌కు శిక్షణనిచ్చినట్లు ఆయన చెప్పారు. ఈవోపీఆర్డీ ఎలీషాబాబు ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. బాపట్ల విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ దేవర వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, గ్రామపంచాయతీల, సచివాలయాల కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యక్రమంలో పలు అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, 14 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గన్నారు.

విద్యుత్ ట్రూఅప్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలి

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలపై మోపుతున్న విద్యుత్ ట్రూఅప్ చార్జీల భారాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు డిమాండ్ చేశారు. భట్టిప్రోలులోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సోలార్ విద్యుత్‌ను యూనిట్ రూ.1.90 పైసలకే ఇస్తామంటే గత ప్రభుత్వం అదాని సోలార్ విద్యుత్ ఉత్పత్తి నుంచి రూ.2.50 పైసలకు ఒప్పందం చేసుకుని కోట్లాది రూపాయలు ముడుపులు అందుకుందని ఆరోపించారు. పెంచిన చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేకుంటే వినియోగదారులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ నాయకులు గొట్టిముక్కల బాలాజీ, బండారి శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ఎత్తివేయాలి

బాపట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఎత్తివేసి విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఐ సీనియర్ నాయకులు జెబి.శ్రీధర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కరెంట్‌చార్జీలు, ట్రూఆప్ చార్జీలు పెంచమని ప్రజలకు హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచటం సరికాదన్నారు. అనంతరం పాతబస్టాండ్ వరకు నిరసన ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బక్కా రామకృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, బిజిలి బాబు, అంకమ్మరావు, పొట్లూరి ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

ఐలవరంలో నగర సంకీర్తన

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస నగర సంకీర్తన కార్యక్రమాన్ని సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు మంగళవారం ప్రారంభించారు. మండల పరిధిలోని ఐలవరం వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని నగర సంకీర్తన కార్యక్రమాన్ని ప్రధాన అర్చకుడు దీవి రంగనాథ చక్రవర్తి, ప్రభావసేవ గోత్రనామ పూజ కార్యక్రమాలతో ప్రారంభించారు. గ్రామ పురవీధుల్లో తెల్లవారుజామున నగర సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కన్వీనర్ కొసనం భాస్కర వెంకటరమణ, పణిదపు నాగులు, జగన్మోహనరావు, వామనపల్లి కోటేశ్వరరావు, జొన్నాదుల సాంబయ్య, తీర్థ నాగేశ్వరరావు, సీహెచ్ సత్యనారాయణ, వాసు, సూర్యవతి, జంజనం హేమశంకరరావు పాల్గొన్నారు.

వివాహితపై అత్యాచారయత్నం

కొల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వివాహితపై అత్యాచారయత్నం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఏడుకొండలు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరుకు చెందిన బాజీ ఈనెల 15న మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఆమె అతని నుంచి తప్పించుకుని కేకలు వేసి ఇరుగుపొరుగువారిని పిలవడంతో వారంతా వచ్చి తిట్టి పంపించారు. ఈనెల 16న బాధితులు బాజీపై దాడి చేశారు. ఈ సంఘటనలపై ఇరువురు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ మేరకు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు.

ముగిసిన డిస్ట్రిబ్యూటరి కమిటీ ఎన్నికలు

● డ్రాగా ముగిసిన 47 డీసీ ఎన్నిక

● లాటరీ పద్ధతిలో ఎంపిక

బాపట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) ఎన్నికలు మంగళవారంతో ముగిశాయి. బాపట్ల ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయంలో 47, 48 డీసీల ఎన్నికలు జరిగాయి. 47 డీసీ పరిధిలో అప్పికట్ల, గుడిపూడి, పూండ్ల, వల్లభరావుపాలెం, గరికపాడు, బోడిపాలెం నీటి సంఘాలు ఉన్నాయి. ఇందులో మూడు సంఘాలు బాపట్ల నియోజకవర్గానికి సంబంధించినవి కాగా మరో మూడు పొన్నూరు నియోజకవర్గానికి సంబంధించినవి. గత రెండు పర్యాయాలుగా పొన్నూరు నియోజకవర్గానికి చెందిన నీటి సంఘాల అధ్యక్షులే డిస్ట్రిబ్యూటరి కమిటీ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు కావున ఈసారి బాపట్ల నియోజకవర్గానికి చెందిన వారికి ఇవ్వాలని కోరారు. అయితే దానికి వారు అంగీకరించకపోవటంతో పోటీ అనివార్యమైంది. బాపట్ల నియోజకవర్గానికి చెందిన అప్పికట్ల నీటి సంఘం అధ్యక్షుడు ఇనగంటి శ్రీకాంత్, పొన్నూరు నియోజకవర్గానికి చెందిన వల్లభరావుపాలెం నీటిసంఘం అధ్యక్షుడు బొద్దులూరి వెంకటేశ్వరరావులు అధ్యక్ష పదవి కోసం నామినేషన్‌లు దాఖలు చేశారు. ఎన్నికలు నిర్వహించగా ఇరువురికి చెరో మూడు ఓట్లు చొప్పున వచ్చాయి. ఈవిధంగా డ్రా కావటంతో ఎన్నికల అధికారిణి ధనలక్ష్మి, అసిస్టెంట్ ఎన్నికల అధికారి శిరీషాలు, ఇరిగేషన్ డీఈ షేక్ జాకీర్ అహ్మద్ సమక్షంలో లాటరీ తీశారు. లాటరీలో ఇనగంటి శ్రీకాంత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తదుపరి ఉపాధ్యక్ష ఎన్నికకు నామినేషన్ దాఖలు చేయమనగా బాపట్ల నియోజకవర్గానికి చెందిన వారంతా బొద్దులూరి వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు ప్రకటించారు. దీంతో అందరు ఆమోదించగా వెంకటేశ్వరరావు ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి ఎన్నిక పత్రాలను అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వారికి అభినందనలు తెలిపారు.

48 డీసీ ఎన్నిక ఏకగ్రీవం

48 డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికను ఎలక్షన్ అధికారి సీహెచ్‌హెచ్ శివకుమార్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ జి.వెంకటరమణ నిర్వహించారు. ఈకమిటీకి సంబంధించి మొత్తం 8 నీటి సంఘాలు ఉన్నాయి. పేరలి-2 నీటి సంఘం అధ్యక్షుడి మల్లారపు శ్రీనివాసరావును అధ్యక్షుడిగా ప్రతిపాదించగా కర్లపాలెం-1 నీటిసంఘం అధ్యక్షుడు దొప్పలపూడి రాజశేఖర్, కర్లపాలెం-2 నీటి సంఘం అధ్యక్షుడు పెనుమెత్స రంగరాజు, గణపవరం నీటి సంఘం అధ్యక్షుడు పులుగు పానకాలరెడ్డి, పేరలి-1 నీటి సంఘం అధ్యక్షుడు బోయన వెంకటస్వామి, అప్పాపురం నీటి సంఘం అధ్యక్షుడు నూతి శరత్, రేటూరు నీటి సంఘం అధ్యక్షుడు చుండూరు రాంబాబు, ఈస్ట్ బాపట్ల నీటి సంఘం అధ్యక్షుడు మద్దిబోయన సోమరాజులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. దీంతో మల్లారపు శ్రీనివాసరావును ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. అదేవిధంగా కర్లపాలెం-1 నీటి సంఘం అధ్యక్షుడు దొప్పలపూడి రాజశేఖర్‌ను ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయా సంఘాల సభ్యులు ఇనగంటి గాంధీ, తుమ్మల మోహన్, నక్కల వెంకటస్వామి, షేక్ బాజి, సముద్రాలురెడ్డి, విజయరాజు తదితరులు పాల్గొని వారిని అభినందించారు.

ఏకగ్రీవంగా 50వ డీసీ ఎన్నిక

బాపట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల డ్రైనేజి సబ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం 50వ డిస్ట్రిబ్యూటరి కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా డీఆర్‌డీఏ పీడీ పి.పద్మ, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా పవన్‌కుమార్ వ్యవహరించారు. మరుప్రోలువారిపాలెం-1 నీటి సంఘం అధ్యక్షులు ఇమ్మడిశెట్టి మధుసూదనరావు అధ్యక్షుడిగా, కంకటపాలెం-1 నీటిసంఘం అధ్యక్షుడు సీతా ఉపేంద్రరావు ఉపాధ్యక్షుడిగా నామినేషన్‌లు దాఖలు చేశారు. వీరిని జమ్ములపాలెం నీటి సంఘం అధ్యక్షుడు నూతలపాటి రంగారావు, నరసాయపాలెం నీటి సంఘం అధ్యక్షుడు మానం విజయచంద్ర, కంకటపాలెం-2 నీటిసంఘం అధ్యక్షుడు బాపట్ల శ్రీను, మరుకొండపాడు నీటి సంఘం అధ్యక్షుడు యర్రా సాంబశివరావు, మరుప్రోలువారిపాలెం-2 నీటి సంఘం అధ్యక్షుడు కోకిజాలి రామిరెడ్డి, మూలపాలెం నీటి సంఘం అధ్యక్షుడు బెజ్జం భూషణం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. దీంతో అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం కావటంతో ఎన్నికల



48 డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు మరకా శ్రీనివాసరావు, దొప్పలపూడి రాజశేఖర్‌లకు ఎన్నికపత్రాలను అందజేస్తున్న అధికారులు



మోర్తోట డీసీ చైర్మన్‌గా ఎన్నికైన పంతాని మురళీధరరావుకు రాజముద్రపత్రాన్ని అందిస్తున్న ఎన్నికల అధికారి

అధికారులు ఎన్నికపత్రాలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్రైనేజి జేఈ భార్గవి, ఏఈ భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.

మోర్తోట, రేపల్లె డీసీలు ఏకగ్రీవం

రేపల్లె, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోర్తోట డీసీ అధ్యక్షుడిగా పంతాని మురళీధరరావు, ఉపాధ్యక్షుడిగా తుమ్మల సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు, జనసేన పార్టీకి చెందిన జొన్నా నర్సయ్యను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రేపల్లె డీసీ అధ్యక్షుడిగా యరగళ్ళ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా అడవులదీవికి చెందిన కూచిపూడి మోహన్‌రావుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి బి.మురళీకృష్ణ తెలిపారు. తొలుత మంగళవారం నీటిపారుదల శాఖ కార్యాలయంలో డీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలు నిర్వహించారు. సభ్యులందరూ ఏకగ్రీవంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. అనంతరం రాజముద్ర పత్రాలను ఎన్నికల అధికారి అందించారు. నూతనంగా ఎన్నికైన డీసీ చైర్మన్‌లు మాట్లాడుతూ తమపై నమ్మకంతో మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎంతోపెద్ద బాధ్యత అప్పజెప్పారని వారికి రుణపడి ఉంటామన్నారు.

డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా సుబ్బారావు



డీసీ అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న సుబ్బారావు

వేమూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేమూరు నియోజకవర్గం 33 డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు మంగళవారం కొల్లూరు ఇరిగేషన్ కార్యాలయంలో నిర్వహించారు. వేమూరు 1 డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా దండే సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా తోట ఏడుకొండలు ఎన్నికయ్యారు. కొల్లూరు ఇరిగేషన్ కార్యాలయంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలను డీడీవోఎం నిర్మల, జిల్లా అగ్రికల్చర్ అధికారి జన్నెమ్మ నిర్వహించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం టీడీపీ నేత మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు మాట్లాడుతూ, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆశీస్సులతో డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన అధ్యక్షులు సాగునీటి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన దండే సుబ్బారావు, యలవర్తి కోటేశ్వరరావు మాట్లాడుతూ, రైతులు తమపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామన్నారు. తమపై నమ్మకంతో ఎంపిక చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపాలం సుబ్బారావు, కుంచె హరినారాయణ, పట్టెల దశరధి, గాజుల సారధి, సురేష్, పందిటి రెడ్డియ్య, బుచ్చి అంకమ్మరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

కొల్లూరు డీసీ అధ్యక్షుడిగా కోటేశ్వరరావు

కొల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా యలవర్తి కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. మంగళవారం కొల్లూరులోని సాగునీటి పారుదల శాఖా కార్యాలయంలో నిర్వహించిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలను డీడీవోఎం నిర్మల, జిల్లా అగ్రికల్చర్ అధికారి జన్నెమ్మ నిర్వహించారు. కొల్లూరు సాగు నీటి సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన యలవర్తి కోటేశ్వరరావును 9 సాగునీటి సంఘాల అధ్యక్షులు అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఈపూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు మల్లంపాటి హరిబాబును ఎన్నుకుని నియామక పత్రాలు అందజేశారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులను కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో సుంకర రాంబాబు, కానరనేని మోహన్, కొల్లూరు శ్రీధర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సాగునీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



డిస్ట్రిబ్యూటరి కమిటీ అధ్యక్షుడిగా ఎన్నిక పత్రం అందుకుంటున్న కోటేశ్వరరావు

జాగర్లమూడి డీసీ అధ్యక్షుడిగా శివారెడ్డి

పిట్టలవానిపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాగర్లమూడి డీసీ (44) అధ్యక్షుడిగా, పలివేరు గ్రామం సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఉన్న తుమ్మా శివారెడ్డి, డీసీ ఉపాధ్యక్షుడిగా చందోలు-2కు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఉన్న ఎండీ ఇస్మాయిల్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఎన్నికల పట్ల చందోలు-2 నీటి సాగు సంఘం పరిధిలోని సభ్యులు, చందోలు గ్రామ, మండల కూటమి నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు.

కూచిపూడి డీసీ అధ్యక్షుడిగా లీలసత్యసాయి

అమృతలూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి నీటిపారుదల శాఖ డిస్ట్రిబ్యూషన్ పరిధిలో డీసీలను ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నుకున్నారు. కూచిపూడి డీసీ 42 సంఘానికి కొరటాల లీలసత్యసాయి, ఉపాధ్యక్షుడిగా కేశం శ్రీనివాసరావు, గోవాడ 41వ డీసీ సంఘానికి అధ్యక్షుడిగా చెరుకుపల్లికి చెందిన మొఖమాటం రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా కావూరి సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

చెరుకుపల్లి డీసీ అధ్యక్షుడిగా రాధాకృష్ణమూర్తి

చెరుకుపల్లి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి మండల నీటి సంఘాల డీసీ అధ్యక్షుడిగా మొఖమాటం రాధాకృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆరు నీటి సంఘాల అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కూచిపూడి సాగునీటి సరఫరా విభాగం ఏఈఈ దివ్యభారతి ప్రకటించారు. ఎన్నికల అధికారిగా హౌసింగ్ బోర్డు ప్రాజెక్టు డైరెక్టర్ యేమినేని వెంకటేశ్వరరావు నిర్వహించారు. రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ తన ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేవిధంగా కాలువల అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడిని చెరుకుపల్లి టీడీపీ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, నాయకులు కె.రవిశంకర్, తాతాజీ, ఇతర కార్యకర్తలు అభినందించారు.

కర్లపాలెం డీసీ అధ్యక్షుడిగా మల్లారపు శ్రీనివాసరావు

కర్లపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండల డీసీ అధ్యక్షుడిగా మల్లారపు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా దొప్పలపూడి రాజశేఖర్ నియమితులయ్యారని నీటిపారుదల శాఖ డీఈ జాకీర్ అహ్మద్ తెలిపారు. మండలంలోని ఎనిమిది నీటి సంఘాలకు సంబంధించి డిస్ట్రిబ్యూటరి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, రాజశేఖర్‌లను ఎన్నుకున్నారన్నారు. డీసీ మెంబరు 48 బాపట్ల-1కు అధ్యక్ష, కార్యదర్శులుగా వ్యవహరిస్తారని డీఈ వివరించారు.

17,234 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ : జేసీ



జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 12 మండలాలలో 102 ఆర్‌బీకేల ద్వారా 17,234.760 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ మంగళవారం తెలిపారు. దీని ద్వారా జిల్లాలో 2వేల మంది రైతులకు పైగా ధాన్యం డబ్బులు బ్యాంక్ ఖాతాలలో జమ అయ్యాయన్నారు. 24 గంటలు నుంచి 48 గంటలలోపే డబ్బులు జమ అవుతున్నాయన్నారు. ఇప్పటి వరకు రూ.32కోట్ల 23లక్షలు రైతుల బ్యాంక్ ఖాతాకు జమ అవుతున్నట్లు తెలిపారు. తుఫాన్ హెచ్చరికల నిమిత్తం రైతులకు ముందస్తు జాగ్రత్తగా రైతు సేవా కేంద్రాలలో 500 టార్పాలిన్ పట్టాలను, గోనెసంచులను అందుబాటులో ఉంచటం జరిగిందన్నారు. 75కేజీలు, 45కేజీల గోనె సంచులు 3 లక్షలకుపైగా రైతు సేవా కేంద్రాలకు పంపటం జరిగిందన్నారు. తేమగా ఉన్న ధాన్యంను డ్రైయర్ కలిగిన మిల్లులకు తరలించటం జరుగుతుందన్నారు. ముందస్తు తుఫాన్ హెచ్చరికల కారణంగా జిల్లాలోని రైతులు ధాన్యం కొనుగోలులో జాప్యం జరగకుండా క్షేత్ర స్థాయిలో కస్టోడియన్ ఆఫీసర్లు, తహసీల్దార్‌లు, పౌరసరఫరాశాఖాధికారులు, వ్యవసాయాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తెలుసుకొని పరిష్కరిస్తున్నామన్నారు.

ఉపాధ్యాయులపై భౌతిక దాడులను అరికట్టాలి

రేపల్లె, డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి) : సమాజాన్ని అత్యున్నత స్థితికి తీసుకువచ్చేందుకు కృషి చేసే గురువులపై ఈమధ్యకాలంలో భౌతికదాడులు పెరిగిపోయాయని, వాటిని అరికట్టాలని రేపల్లె ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘం పీడీ సోషలిజం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై దాడులను అరికట్టాలంటూ మంగళవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యాబోధన, వ్యవహారశైలిపరంగా ఏమైనా సమస్యలు వచ్చినపుడు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలేకాని ఉపాధ్యాయులపై దాడులు నిర్వహించటం హేయమైన చర్య అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నేతలు ఎంవీవీ సుబ్రహ్మణ్యం, డి.వేణుమాధవ్, ఎం.అంకయ్య, జొన్నలగడ్డ సుబ్బారావు పాల్గొన్నారు.

బావుడా చైర్మన్‌ను సన్మానించిన జనసేన నాయకులు

బాపట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబును జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ మంగళవారం పార్టీశ్రేణులతో మర్యాదపూర్వకంగా కలిశారు. పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయనను ఘనంగా సత్కరించి సన్మానించారు. బావుడా పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి చేసే పనిలో తాము భాగస్వాములౌతామని ఆయన తెలిపారు.

ఆటో బోల్తా : ఇద్దరికి గాయాలు

బాపట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ వద్ద ఆటో డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో యారం కోటేశ్వరరావు అనే పాస్టర్ తోపాటు మరొక ప్రయాణికుడు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కోటేశ్వరరావు గుంటూరు ఆసుపత్రిలో చేరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జానీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంగళవారం తెలిపారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

కొల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులను అధికారులు రెండు గ్రామాల్లో నిర్వహించారు. మండల పరిధిలోని గాజుల్లంక, చింతల్లంక గ్రామాల్లో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి అధికారులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, దీర్ఘకాలంగా భూసమస్యలు ఉన్న రైతులు సదస్సుల్లో అర్జీలు అందించి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాం బాలాజీరెడ్డి, డీటీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గ్రామపంచాయతీలో తహసీల్దార్ పి.మెహర్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్‌కు అర్జీలు అందజేశారు. తహసీల్దార్ పి.మెహర్‌కుమార్ మాట్లాడుతూ సుమారు 35 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కె.శ్రీనివాసరావు, సర్వేయర్ ఆదినారాయణరావు, చందోలు శ్రీబగళాముఖి దేవస్థానం సహాయకులు కె.శ్రీనివాసరావు, వ్యవసాయశాఖాధికారులు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, వివిధశాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

● చుండూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జరుగుతున్న గ్రామ రెవెన్యూ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ దేవరకొండ నాగరాజు కోరారు. మంగళవారం మండూరులో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా భూ వివాదాలకు సంబంధించిన సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వీటి పరిష్కారం కోసమే ఈ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సర్పంచ్ ఉమాదేవి, వీఆర్వో రత్నప్రసాద్, కార్యదర్శి మహాలక్ష్మి, సాంబశివరావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● కర్లపాలెం డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని చింతాయపాలెంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆరు అర్జీలు వచ్చాయని కర్లపాలెం తహసీల్దార్ సుందరమ్మ తెలిపారు. సర్వే కొలతలపై మూడు దరఖాస్తులు, మ్యూటేషన్‌కు ఒక దరఖాస్తు, ఆన్‌లైన్‌కు ఒక దరఖాస్తు వచ్చాయని తహసీల్దార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీరామమూర్తి, వీఆర్వో, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలు

బాపట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం సెమి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్జీవోహోమ్‌లో డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి క్యాండిల్స్ సర్వీస్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఐవో వెంకటేశ్వర్లు, ఆర్‌బీఎస్‌కే జిల్లా అధికారి డాక్టర్ సౌజన్య, డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ కళ్యాణ్ గోపి, డాక్టర్ నితిన్, డాక్టర్ మౌనిక, ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లైట్‌హౌస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో...

వేమూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : లైట్‌హౌస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వేమూరులో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మొండితోక నాగేశ్వరరావు నిర్వహణలో జరిగిన కార్యక్రమానికి బాపట్ల పార్లమెంటరీ స్థాయి తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టార్‌ను ప్రారంభించి కేక్ కట్ చేశారు. కెన్యాకు చెందిన సిస్టర్ రోజ్లిన్ డానియేల్ వాయిస్ మణికిషోర్ సంఘ పెద్దలు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన దాది శాంతకుమారి అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందారు. చికిత్సకు అయిన ఖర్చును ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పించి సహకరించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు దరఖాస్తు చేశారు. ఆనందబాబు సిఫార్సు మేరకు శాంతికుమారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.50,287 మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును ఆనందబాబు చేతుల మీదుగా మంగళవారం గుంటూరు క్యాంపు కార్యాలయంలో శాంతికుమారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

● అమృతలూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న బాధితునికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు రూ.65 వేలు వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మంగళవారం అందజేశారు. మండల పరిధిలోని మోపర్రు గ్రామానికి చెందిన కొత్తపల్లి రాధాకృష్ణమూర్తి అనారోగ్య సమస్యలతో చికిత్స పొందారు. చికిత్స కోసం అయిన ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధికి వేమూరు ఎమ్మెల్యే ద్వారా సిఫార్సు లెటరును అందజేశారు. దీంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.65,182 మంజూరు చేస్తూ చెక్కును మంజూరు చేశారు. ఈ చెక్కులు గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారునికి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కొడాలి నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలతో మహిళలకు రక్షణ

● బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ వేము రామాంజనేయులు



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ వేము రామాంజనేయులు

బాపట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చట్టాలే మహిళలకు రక్షణ అని ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ వేము రామాంజనేయులు తెలిపారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం జిల్లా స్థాయి శిక్షణా శిబిరాన్ని దళిత బహుజన రీసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి రామాంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాల్యంలో ఆడబిడ్డలకు వివాహాలు చేయరాదన్నారు. ప్రతి మహిళ తల్లిగా, భార్యగా, బిడ్డగా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్న మనదేశంలో ఆడపిల్లలను రక్షించుకునేందుకు నేటికి చట్టాలమీద ఆధారపడి ఉండటం దురదృష్టకరమన్నారు. బాల్యవివాహాల నిరోధక చట్టం గురించి, గృహ హింస వ్యతిరేక చట్టం గురించి వివరించారు. దళిత బహుజన రీసోర్స్‌సెంటర్ రాష్ట్ర మహిళా కన్వీనర్ హేమలత మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల పట్ల వివక్ష హేయమన్నారు. మహిళలలో అవగాహన కల్పించేందుకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సఖీ వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధి కె.ఉషారాణి, లీగల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.మౌనిక, జి.శ్రీప్రియ, డీబీఆర్‌సీ రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు తులసీ చంద్రశేఖర్, న్యాయవాది దగ్గుమల్లి కిరణ్‌కుమార్, ఐద్వా నాయకులు టి.సుభాషిణి, వి.భగవాన్‌దాసు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ముఖాముఖీ పోటీకి బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ సిద్ధం

బాపట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యవర్గ ఎన్నిక ప్రక్రియలో భాగంగా మంగళవారం నామినేషన్‌ల ఉపసంహరణ జరిగింది. దీంతో ముఖాముఖీ పోటీకి సిద్ధమయ్యారు. ముప్పలనేని శ్రీనివాసరావు ప్యానల్, మానం నాగేశ్వరరావు ప్యానల్ పోటీకి దిగాయి. అధ్యక్ష పదవికి ముప్పలనేని శ్రీనివాసరావు, దొప్పలపూడి రామ్మోహనరావులు పోటీలో ఉన్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడు-1కి కొల్లా వీరయ్యచౌదరి, కారుమంచి వెంకట్రావులు, ఉపాధ్యక్ష-2కు చెన్నుపాటి వీరయ్య, పారేపల్లి చంద్రశేఖర్‌లు బరిలో ఉండగా కార్యదర్శి పదవికి మానం నాగేశ్వరరావు, కారుమంచి వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ పదవికి కొమ్మినేని హరిపద్మప్రసాద్, దొడ్డపనేని వెంకయ్యచౌదరిలు పోటీ పడుతున్నారు. తాళ్ళూరి రామకృష్ణ, కోట వీరబ్రహ్మయ్యలు కోశాధికారి పదవికి పోటీలో ఉన్నారు. ఈనెల 22న జరిగే ముఖాముఖీ పోటీల్లో ఏ ప్యానల్ నుంచి ఎవరు గెలుస్తారో వేచిచూడాల్సి ఉంది. కాగా ఈ ఎన్నిక చర్చనీయాంశంగా మారింది.

వ్యవసాయ కళాశాలలో పెన్షనర్స్‌డే

బాపట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల వ్యవసాయ కళాశాలలో మంగళవారం పెన్షనర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల అసోసియేట్‌డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పింఛన్‌దార్లు తేలికపాటి వ్యాయామాలైన నడక, యోగ, ప్రాణాయామం చేస్తూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం సీనియర్ పెన్షన్‌దార్లను సన్మానించారు. భీమా శంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్‌వలి, కె.సుబ్బారావు, ఎన్.గురుమూర్తి, జి.ఏసోబు, కె.కమలమ్మ, సీహెచ్ సత్యనారాయణ, కె.సాంబయ్య, కె.బసవయ్య, శ్యామ్‌సన్, బి.అరవింద్, కొటికలపూడి సోమయ్య, కె.భాస్కరరావు, పి.భాస్కరరావు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, డిసెంబరు 17 (ఆంధ్యజ్యోతి) : చెరుకుపల్లిలోని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ వారు మంగళవారం పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు. వివిధ విభాగాలలో విశేషమైన సేవలు చేసిన కొందరికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకూరి సుబ్బారావు, చెరుకుపల్లి మండల పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.అంజనేయులు, తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, సబ్ రిజిస్ట్రార్ కె.రాజేంద్ర, బ్యాంక్ ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్ ఎస్‌కే కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కిశోరి బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి : సీడీపీవో



కిశోరి వికాసం కార్యక్రమం గురించి వివరిస్తున్న సీడీపీవో లక్ష్మీ పార్వతి

బాపట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కిశోరి బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సీడీపీవో లక్ష్మీ పార్వతి తెలిపారు. బాపట్ల మండలపరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం కార్యక్రమంపై టీవోటీలకు మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సీడీపీవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. విద్య నైపుణ్యాలభివృద్ధి, సామాజిక సాధికారిత, మాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాబురావు, ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు, ఎంఈవో ఎస్.నిరంజన్, ఏపీఎం సురేష్‌బాబు, డీసీపీవో పురుషోత్తంరావు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) కిశోరబాలిక వికాసంపై 11 నుంచి 12 సంవత్సరాల బాలికలకు వంద రోజుల వికాస బాలిక కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం కిశోరి వికాసంపై ఉపాధ్యాయులు, పలు శాఖల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ గోపీనాథ్, ఏపీఎం శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయులు విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

తల్లి, కుమార్తె అదృశ్యం

కొల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపూరు గ్రామానికి చెందిన ఈపూరు మనోహర్ భార్య నాగమల్లేశ్వరి, కుమార్తె యశ్విత ఈ నెల 14వ తేదీ తెల్లవారుజాము నుంచి కనిపించకుండా పోయారు. బంధువుల దగ్గర విచారించినా ఫలితం లేకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. అయితే 14న రాత్రి భార్యభర్తలు ఘర్షణ పడినట్లు తెలిసిందని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

నటనకు తొలి మెట్టు రంగస్థలం

రంగస్థలంపై నటనకు శ్రీకారం చుట్టి సినిమాల్లో నటించి ఒక వెలుగు వెలిగిన నటీనటులు ఎందరో. స్టేజ్‌పై డైలాగ్స్ చెబుతూ, హావభావాలు పలికిస్తూ.. ప్రేక్షకుల చప్పట్లతో మార మోగిపోతుంటే ఆ కళాకారుడు, దర్శకుడు పొందే ఆనందం మాటల్లో చెప్పలేం. అయితే, ఆ రచయితో, కళాకారుడో, దర్శకుడో తమ ప్రతిభ చాటుకోవాలంటే ఒక వేదిక కావాలి.. అవకాశమూ రావాలి. అటువంటి అవకాశాలు కల్పించేవి నాటక కళాపరిషత్‌లు, మెమోరియల్ ట్రస్టులు ఆంధ్రరాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. అటువంటివాటిలో ఒకటి పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్టు. నాటకాల ద్వారానే స్వచ్ఛమైన నటుడు బయటకు వస్తాడన్న ఆయన కుమారుడి ఆకాంక్ష మేరకు అలాంటి నటుల కోసం ఆ ట్రస్టు ద్వారా పరుచూరి వెంకటేశ్వర రావు నాటక పోటీలను నిర్వహిస్తున్నారు.



పల్లెకోనలోని నందమూరి తారక రామారావు కళా భవనాన్ని ప్రారంభిస్తున్న అప్పటి మాజీమంత్రి కోడెల శివప్రసాద్



పల్లెకోనలో టి.సుబ్బరామిరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన పరుచూరి రఘుబాబు, టి.సుబ్బరామిరెడ్డి కల్యాణమండపం

- నాటకాలకు ఊపిరిపోస్తున్న పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్టు
- కుమారుడు జ్ఞాపకార్థం పల్లెకోనలో కళాప్రాంగణం
- ముప్పై రెండేళ్లుగా కొనసాగుతున్న పోటీలు

రేపల్లె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సినిమా కథలు, మాటల రచయితలు, నటులు, నాటక రచయితలు పరుచూరి బ్రదర్స్ వెంకటేశ్వర రావు, గోపాలకృష్ణలు తమ రచనలతో ఎంత ప్రజాదరణపొందారో ప్రత్యేకంగ చెప్పక్కర్లేదు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పల్లెకోనలో పరుచూరి రఘు బాబు మెమోరియల్ ట్రస్టును 1991లో ఏర్పాటు చేశారు. అఖిల భారత స్థాయిలో నాటకోత్సవాలనునిర్వహిస్తున్నారు. సమాజంలో రుగ్మతలు, దోపిడీ వ్యవస్థ, సామాజిక అంశాలను ఇతివృత్తంగా తీసుకుని రచించి ప్రజలను చైతన్యపరిచే నాటికలను ప్రోత్సహిస్తూ, నాటక రంగం అభివృద్ధి కోసం ఈ ట్రస్టు తమ వంతు పాత్ర పోషిస్తోంది.



పరుచూరి వెంకటేశ్వరరావు, భార్య విజయలక్ష్మికి ఇద్దరు కుమారులు పరుచూరి రఘుబాబు, పరుచూరి రవి, కుమార్తె పద్మావతి. రఘుబాబు గతంలో మృతి చెందారు. తన కుమారుడు గుర్తుగా పల్లెకూన లో నందమూరి తారకరామారావు కళాప్రాంగణాన్ని ఏర్పాటు చేసిన వెంకటేశ్వరరావు, ప్రతి సంవత్సరం అఖిలభారత నాటకోత్సవాలను నిర్వహిస్తున్నారు. పరుచూరి వెంకటేశ్వరరావు నాయనమ్మ గ్రామం, ఆయన భార్య విజయలక్ష్మి సొంత ఊరు పల్లె కోన. అంతేకాదు, రఘుబాబు తన చిన్నతనంలో కొంత కాలం పల్లెకూనలో పెరిగాడు. ప్రతి ఏడాది ఐదురోజుల పాటు పౌరాణిక, జానపద నాటక పోటీలు జరుగుతాయి.

దాతల సహకారం..

రేపల్లెకు పట్టణానికి చెందిన వేములపల్లి సుబ్బారావు 63 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. మరికొంతమంది 37 సెంట్ల స్థలాన్ని పరుచూరి వెంకటేశ్వరరావుకు ఉచితంగా ఇచ్చారు. దీంతో పాటు తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి సహకారంతో ఆడిటోరియం సినీనిర్మాత, రాజ్యసభ మాజీ సభ్యుడు టీ సుబ్బిరామిరెడ్డి సహకారంతో పరుచూరి రఘుబాబు, టి.సుబ్బిరామిరెడ్డి లలితకళాపరిషత్ భవనాన్ని నిర్మించారు. వీటిని మాజీ మంత్రి కోడెల శివప్రసాద్, పరుచూరి బ్రదర్స్ అప్పట్లో ప్రారంభించారు.



నాటక ప్రారంభంలో జ్యోతిప్రజల్వన కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటులు రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్వర రావు, ఎమ్మెల్యే ఆనందబాబు



పరుచూరి రఘుబాబుకు నివాళులర్పిస్తున్న తల్లిదండ్రులైన పరుచూరి వెంకటేశ్వరరావు, విజయలక్ష్మీ కుమారుడు రవి





అలెగ్జాండర్ నాటికలో ప్రతిభ కనబరిచిన జయప్రకాష్‌రెడ్డికి మెమోంటోను అందిస్తున్న పరుచూరి వెంకటేశ్వరరావు, ఎంఎస్‌నారాయణ (ఫైల్ ఫోటో)

కుమారుడి ఆశయం కోసం..

ట్రస్టీ పరుచూరి వెంకటేశ్వరరావు తమ కుమారుడు రఘుబాబు ఆశయం, భార్య విజయలక్ష్మి కోరిక మేరకు పల్లెకోనలో గతంలో ఆడిటోరియం నిర్మించి ప్రతియేటా నాటకోత్సవాలను నిర్వహిస్తున్నాం. వయస్సురీత్యా పెద్దవాడిని కావడం, దూరాభారం కావడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నేను ఉన్నంత వరకూ కళారంగాన్ని ప్రోత్సహిస్తాను. 32 సంవత్సరాలు పాటు వందలాది నాటకాలను ప్రదర్శించి కళాకారులను ప్రోత్సహించాను. నటన లేక పోయినా హీరోలు అయ్యే పరిస్థితి ప్రస్తుతం సినీరంగంలో ఉంది.

స్నాతకోత్సాహం

(5వ పేజీ తరువాయి)..
డిగ్రీలను ప్రదానం చేశారు. ఎయిమ్స్‌మంగళగిరి సెంటర్‌ఫర్ మెడికల్‌ఎడ్యుకేషన్‌టెక్నాలజీ బ్రోచర్‌ను కేంద్రసహాయమంత్రిజాదవ్ ఆవిష్కరించారు.

47 మందిలో 17 మంది మహిళలే

ఎయిమ్స్‌లో డిగ్రీలు తీసుకున్న 47 మందిలో 17 మంది మహిళలే. దీనిపై రాష్ట్రపతి ముర్ము హర్షం వ్యక్తం చేశారు. వైద్యవృత్తిలో పెరుగుతున్న మహిళల బాగస్వామ్యంతోపాటు వారి గణనీయమైన సహకారాన్ని చూస్తూ ఉంటే అభివృద్ధి చెందుతున్న సమాజంగా మారుతున్నట్లు అనిపిస్తోందన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌కు మొదటి బ్యాచ్ విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లన్నారు. తన ప్రసంగంలో ముందుగా ఆమె మంగళగిరి క్షేత్రాన్ని గురించి ప్రస్తావించి వేదికపై నుంచే పానకాలస్వామికి నమస్కారాలను తెలిపారు. నరసింహస్వామి చెంత వైద్యవిద్యను అభ్యసించిన విద్యార్థులందరూ ఎంతో అదృష్టవంతులన్నారు. వైద్యులు సేవకు ప్రాధాన్యమివ్వాలని, యువ వైద్యులు మరింత చిత్తశుద్ధితో వ్యవహరించాలని తెలిపారు. ప్రజలు పూర్తిస్థాయి ఆరోగ్యవంతులుగా ఉండాలని.. అందుకోసం ప్రతి ఒక్కరూ తమ తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు.

దేశ భవిష్యత్ నగరంగా అమరావతి - ముఖ్యమంత్రి చంద్రబాబు

దేశ భవిష్యత్ నగరాల్లో ఏపీ రాజధాని అమరావతి ప్రముఖంగా నిలువబోతుందని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు.దేశంలోని ఎయిమ్స్‌లన్నింటిలోనూ రాజధాని అమరావతి పరిధిలోని మంగళగిరి ఎయిమ్స్ నెంబర్‌వన్‌గా నిలుస్తుందన్న నమ్మకం తనకుందన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌లో ఎలాంటి మౌలిక సదుపాయాలకు లోటు రానివ్వబోమని హామీ ఇచ్చారు. దేశంలోని ఏ ఎయిమ్స్‌లో కూడా ఇంత సుందరమైన, ఆహ్లాదకర మైన వాతావరణం లేదన్నారు. ముర్ము సామాన్య ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చి దేశ అత్యున్నత పదవిని సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. కష్టపడితే ఈ ప్రపంచంలో సాధించలేనిది ఏదీ లేదనడానికి ద్రౌపదిముర్ము జీవితమే ఒక ఉదాహరణ అని చెప్పారు. సీఎం చంద్రబాబు రాష్ట్రపతి ద్రౌపదిముర్మును శాలువతో సన్మానించి తిరుమల శ్రీవారి మెమొంటోను అందజేశారు. రాష్ట్రపతికి మంత్రి నారా లోకేశ్ మంగళగిరి చేనేత చీరెను బహూకరించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ మదబానందకర్, కలెక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

స్వల్ప వివాదం.. ఆగిన వివాహం

- తెలంగాణ మాజీ ఎమ్మెల్యే కూతురుతో ఓ ఐపీఎస్‌కు వావాహం నిశ్చయం
- కాంగ్రెస్ జెండాలతో ర్యాలీగా వెళ్లాలని పట్టుబట్టిన పెళ్లి కుమార్తె తరపు బంధువులు
- ససేమిరా అన్న ఐపీఎస్ వరుడు
- నిలిచిన పెళ్లి .. రంగంలోకి కాంగ్రెస్ నేతలు
- అర్థరాత్రి వరకు కొనసాగుతూనే ఉన్న చర్చలు

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్వల్ప విషయంలో తలెత్తిన వివాదంతో ఓ ఐపిఎస్ పెళ్లి కి బ్రేక్ పడింది. పెళ్లి కుమారుడు ఐపీఎస్ అధికారి కాగా పెళ్లి కుమార్తె డాక్టర్. వివరాల్లోకి వెళ్తే నగరానికి చెందిన యువకుడు గుజరాత్ క్యాడర్ ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు. ఆయన ప్రొఫెషనరీ పీరియడ్ పూర్తి చేసుకొని అక్కడ ఓ జిల్లాకు ఎస్పీగా ఇటీవలే నియమితులయ్యారు. ఆయనకు తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కుమార్తె అయిన డాక్టర్ తో వివాహం నిశ్చయించారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల 30 నిమిషాలకు డాన్ బాస్కోలో వివాహం జరగాల్సి ఉంది. మరి కొద్దిసేపట్లో పెళ్లి తంతు ప్రారంభం కావలసిన సమయంలో తెలంగాణ ప్రాంతం నుండి వచ్చిన పెళ్లి కుమార్తె తరపు బంధువులు పెద్ద సంఖ్యలో పట్టాభిపురం మెయిన్ రోడ్డుపై జూట్ మిల్స్ సమీపంలో ఉన్న ఐపీఎస్ అధికారి ఇంటి వద్దకు వెళ్లారు. తెలంగాణలోని తమ సంప్రదాయం ప్రకారం ఇరువురిని ఇంటి వద్ద నుంచి డాన్ బాస్కో వరకు కారులో కాంగ్రెస్ పార్టీ జెండాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లాలని పట్టుబట్టారు. ఎళ్లి కుమారుడు ఐపీఎస్ అధికారి కావడంతో అందుకు ససేమిరా అన్నారు. దీంతో ఈ విషయం మీరు వర్గాల మధ్య పంతానికి దారి తీసింది. చివరకు సున్నితమైన అంశం వివాదాస్పదంగా మారడంతో బ్రేక్ పడింది. పెళ్లి కుమార్తె తండ్రి తెలంగాణకు చెందిన మాజీ ఎమ్మెల్యేని రాక ప్రభుత్వం ఏఐసీసీలో కీలకంగా వ్యవహరిస్తుండటంతో తొలుత సంప్రదింపులు ద్వారా సమస్య పరిష్కారానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో మాజీ ఎమ్మెల్యే బంధువులు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పెళ్లి కుమారుడు ఇంటి వద్ద పెళ్లి హడావిడి చేశారు. దీంతో పెళ్లి కుమారుడు ఐపీఎస్ అధికారులతో పోలీసులు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పెద్ద సంఖ్యలో పోలీస్ అధికారులు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది.

ఇతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే మస్తాన్వలి మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, సుంకర పద్మశ్రీ లతోపాటు కల్లూరు కాంగ్రెస్ నాయకులు ఐపీఎస్ అధికారి ఇంటికి వెళ్లి ఆయనతో కుటుంబ సభ్యులతో చర్చలు జరుపుతున్నారు. పీటల మీద పెళ్లి నిలిచిపోయిందని తెలియడంతో పెళ్లి కుమార్తె తల్లి గుండెపోటుతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. పెళ్లికి ఐపీఎస్ అధికారి కుటుంబ సభ్యులు విముఖత చూపుతుండటంతో వారిని ఒప్పించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

అర్థరాత్రి దాటిన చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి మరో వైపు పెళ్లికి మాత్రం తరుపున వచ్చిన సుమారు వందల మంది పెళ్ళి కుమారుడి బయటే మోహరించి కూర్చున్నారు. పెళ్లి కుమారుడు తరఫున ఆయన బంధువైన ఫాదర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో చర్చలు జరుపుతున్నారు.

అబాకస్‌లో మువ్వా వేదాన్ష్ ప్రతిభ

- 8 నిమిషాల్లో 200 సమస్యలను పరిష్కరించి అంతర్జాతీయ ఛాంపియన్ షిప్ కైవసం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): యూనివర్సల్ కాన్సెప్ట్ మెంటల్ ఆర్థమెటిక్ సిస్టమ్(ఈసీఎమ్ఎఎస్) ఆధ్వర్యంలో ఢీల్లీలో ఈ నెల 14,15 తేదిల్లో జరిగిన అంతర్జాతీయ అబాకస్, మెంటల్ ఆర్థమెటిక్ పోటీల్లో నగరంలోని తారకరామ్‌నగర్‌కు చెందిన మువ్వా వేదాన్ష్ సత్తా చాటాడు. కేవలం 8 నిమిషాలలో 200 సమస్యలను పరిష్కరించి ఓవరాల్ అంతర్జాతీయ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నాడు. ఈపోటీలకు 30 దేశాలు, పలు రాష్ట్రాలను చెందిన దాదాపు 6వేల మంది విద్యార్థులు హజరైయ్యారు. ఈ పోటీలలో మువ్వా వేదాన్ష్ పాల్గొని ఈ ఘనతను సాధించారు. ఇప్పటికే అబాకస్ లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్న మువ్వా వేదాన్ష్‌ను పలువురు అభినందించారు.



ఓవరాల్ అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్ ట్రోఫితో మువ్వా వేదాన్ష్

సంక్రాంతికి సాధ్యమేనా?

(5వ పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. పల్నాడు.. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2,153.50 కిలోమీటర్ల మేర రహదారుల్లో పనులకు రూ.113.99 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. రహదారులను ప్యాకేజీలుగా విభజించి 456 పనులు చేపడితే ఇప్పటికి 19 పనులు మాత్రమే పూర్తయినట్లు ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ప్రగతి నివేదికలు తెలియజేస్తున్నాయి. పనులు నత్త నడక కన్నా నిదానంగా సాగుతున్నాయి. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో గుంతల రహదారులతో వాహనచోదకులు ఇక్కట్లు పడుతున్నారు. సంక్రాంతి కల్లా పనులు పూర్తవుతాయని ప్రభుత్వం ప్రకటించినా పురోగతి ఆమేరకు కనిపించడంలేదు. మూడుజిల్లాల్లో కాస్తంత పల్నాడు జిల్లాలో పనులు పురోగతి కొంత మెరుగ్గా ఉంది. రహదారుల గుంతల పూడ్చివేతకు వారం వారం లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించినా ఆ మేర లక్ష్యాలను చేరుకోవడంతో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. పనుల్లో జరుగుతున్న జాప్యంతో రహదారుల ఇక్కట్లు ఇప్పట్లో వాహనదారులకు తీరే పరిస్థితులు కానరావడం లేదు. పురోగతిని పరిశీలిస్తే ప్రభుత్వం ప్రకటించినట్లుగా సంక్రాంతికి పూర్తి అయ్యే పరిస్థితులు లేవని చెప్పవచ్చు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో కూడా రహదారులపై గుంతల పూడ్చివేతపై చర్చ జరిగింది. వేగవంతంగా పనులు పూర్తి చేసి రహదారుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.



చిల్లీస్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్‌లో ఎన్నికల సందడి

- కొద్ది రోజుల్లోనే ముగియనున్న ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం
- రేపు సమావేశమై చర్చించనున్న నేతలు

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ది గుంటూరు చిల్లీస్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్‌లో ఎన్నికల హడావిడి ప్రారంభమైంది. ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం జనవరి 12వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త కమిటీని ఎన్నుకొనేందుకు ఎన్నికల నిర్వహణపై కార్యచరణ ప్రణాళిక రూపొందించుకొని ఆ దిశగా ముందుకెళ్లాలని సభ్యులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం (డిసెంబరు 19వ తేదీ) 6 గంటలకు ఏటుకూరు రోడ్డులోని ఫ్యాన్సీ డిస్ట్రిబ్యూటర్స్ ప్లాజాలో సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ సెక్రెటరీ డీ నరేంద్రబాబు సభ్యులకు సమాచారం అందించారు. ఎన్నికలతో పాటు గత రెండేళ్లలో జరిగిన ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని సభ్యుల ముందుంచుతామన్నారు. అలానే కమీషన్ ఏజెంట్‌లు మిర్చియార్డులో ఎదుర్కొంటున్న ఇతరత్రా సమస్యల పైనా చర్చించనున్నారు.

పరీక్షా కాలమ్




నిశిత పరిశీల.. విశ్లేషణ సాధనతో గణితంలో మెరుగైన మార్కులు

'పదో తరగతి పరీక్షల్లో అత్యంత కీలకమైన సబ్జెక్టు గణితం. సాదాసీదా విద్యార్థులు సైతం కొద్దిగా కష్టపడితే అత్యధిక మార్కులు తెచ్చుకుని స్కోరు పెంచుకునే అవకాశం ఉంది. దానికోసం నిశిత పరిశీలన, విశ్లేషణాత్మక సాధన అవసరం' అని గుంటూరు లోని చౌత్రా సెంటరులో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఆట్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. 'పరీక్షా కాలమ్'లో గణితంలో సాధన గురించి పదో తరగతి విద్యార్థులకు ఆయన చెవుతున్న పలు సూచనలు..

గుంటూరు (విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు ప్రారంభం అయ్యే వరకు ప్రతి రోజు లెక్కల్ని విభాగాల వారీగా సాధనం చేయడం ఫార్ములాలు మననం చేసుకోవడం వంటి జాగ్రత్తలతో మెరుగైన మార్కులు సాధించేందుకు అవకాశం ఉంది. పటిష్టమైన సాధనతో గణితంలో నూటికి 95 పైగా ఒక్కొసారి నూటికి నూరు మార్కులు సాధించే అవకాశం ఒక్క గణితం సబ్జెక్టులోనే సాధ్యం అనే విషయం విద్యార్థులు విస్మరించకూడదు. అయితే దీనికి నిరంతర సాధన ఎంతో అవసరం. ఒకటికి మూడు సార్లు లెక్కల్ని సాధన చేయాల్సి ఉంటుంది. గణితంలో సెమ్ 1లో ఏడు పాఠ్యాంశాలు,సెమ్-2లో మరో ఏడు పాఠ్యాంశాలు చొప్పున మొత్తం 14 పాఠ్యాంశాలు ఉంటాయి.

- తొలుత రియల్ నెంబర్స్‌లో ప్రధానంగా హెచ్‌సిఎఫ్, ఎల్‌సియంరూట్‌నంబర్స్ సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. ఇందులో ఒన్‌మార్కు, 8 మార్కుల ప్రశ్నలు ఉంటాయి.
- తరువాత పెయిర్ ఆఫ్ లీనియర్‌లో ఇక్వేషన్స్‌లో గ్రాఫ్‌కు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. సరళరేఖల జతలకు సంబంధించిన నిష్పతుల పోలిక, బీజగణతం వివరణకు సంబంధించిన ప్రశ్నలు వస్తాయి ఇవి ఎనిమిది మార్కులకు ఇస్తారు.
- కోఆర్డినేట్ జామెట్రిలో ప్రధానంగా డిస్టెన్స్ ఫార్ములా, సెక్షన్ ఫార్ములా మీద ప్రశ్నలు వస్తాయి. ఇవి నాలుగు మార్కులకు వస్తాయి.
- అర్థమెకటిక్ ప్రొగ్రెసెన్స్ ఇందులో ఎపి అర్థమెటిక్ ప్రొగ్రెసెన్, ఎన్త్ ఎన్ వ పదం, ఎన్‌వ పదాల మొత్తం వంటి వాటి మీద ప్రశ్నలు వస్తాయి.
- సెమిస్టర్-2లో ప్రొబలిటి పాఠంలో కార్డ్సలెక్కలు డైస్‌మీద,కాయిన్స్ మీద ఉన్నటువంటి లెక్కలు 13 మార్కులకు వస్తాయి.
- స్టాటిస్టిక్స్‌లో మీన్,మీడియన్,మోడ్ మీదున్న సమస్యలు, ఫార్ములా వివరణ మీద 12 మార్కులకు ప్రశ్నలు వస్తాయి.
- ఇంటర్‌డక్షన్ ఆఫ్ ట్రిగనామెట్రీ, అప్లికేషన్ ఆఫ్ ట్రిగనామెట్రీలో విభావంలో 8 మార్కుల ప్రశ్నలు వస్తాయి. ఇందులో బొమ్మవేయడం, పార్టులు రాయడం, తరువాత సమస్య పరిష్కారం చేయాలి.
- పరీక్ష సమయంలో ముందుగా ప్రశ్నాపత్రాన్ని బాగా చదువుకోవాలి. పూర్తిగా అర్థం చేసుకున్న తరువాతే రాయడం ప్రారంభించాలి.
- గణితం పరీక్షలో ముందుగా బాగా వచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయాలి, రాని ప్రశ్నలు మరోసారి పరిశీలించి రాయాలి. కనీసం ఫార్ములా వేసినా లేదా లెక్కను గుర్తున్న వరకు చేసిన మార్కులు వస్తాయి.
- ఇప్పుడు ఉన్న సమయంలో ప్రతిరోజు విభాగాల వారీగా లెక్కల్ని సాధన చేయాలి. ఫార్ములాలు గుర్తుంచుకోవాలి. పరీక్షల అప్పుడే పరీక్షల సమయంలో మంచి మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుంది.



ఆట్ల శ్రీనివాసరెడ్డి, గణిత ఉపాధ్యాయుడు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల గుంటూరు.


త్రికోటేశ్వరునికి మహా రుద్రాభిషేకం

- జ్యోతి దర్శనంతో పులకించిన భక్తులు

కోటప్పకొండ (నరసరావుపేట), డిసెంబరు 17 : ఆరుద్రోత్సవం సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామికి మహారుద్రాభిషేకాలు సోమవారం అర్థరాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు నేత్ర పర్వంగా జరిగాయి. సుగంధ ద్రవ్యాలతో స్వామిని అభిషేకించారు. ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, విభూది, గంధం, కుంకుమ, తైలం, సుగంధ ద్రవ్యాలు, ఫలాలతో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. స్వామికి అన్నాభిషేకం వైభవంగా జరిగింది. అర్థరాత్రి పాత కోటేశ్వర స్వామి దేవాలయం వద్ద కర్పూర జ్యోతి దర్శనం చేసుకొని భక్తులు పులకించి పోయారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అభిషేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో ఏర్పాట్లను ఈవో డీ చంద్రశేఖరరావు పర్యవేక్షించారు.



శ్రీ త్రికోటేశ్వర స్వామికి అన్నాభిషేకం



పాలు, గంధం, చెక్కర, ఎండు ఫలాలతో స్వామి వారికి అభిషేకాలు



బొమ్మనంపాడులో మొక్కజొన్నను పరిశీలిస్తున్న అధికారులు

తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోవాలి

ఏడీఏ మోహనరావు

పర్చూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శనగలో కుంకుమ ఇతర తెగుళ్లను రైతులు నివారించి పంటలను కాపాడుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.మోహనరావు అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నుంబొట్ల అగ్రహారం, భూషాయపాలెం గ్రామాల్లో ఏవో రామ్మోన్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెగుళ్లను తొలిదశలో గుర్తించి నివారణ చర్యలు చేపడితే మంచి ఫలితం ఉంటుందన్నారు. కుంకుమ తెగులు నివారణకు 35-40 రోజులు ఉన్నప్పుడు కాంటాఫ్ ప్లష్ 400 ఎంఎల్ లేదా టిల్ట్ 200 మాల్‌ను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ. డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మొకకజొన్న, శనగ సాగు చేసిన రైతులు పంటలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి కోరారు. మంగళవారం మండలంలోని కొణిదెన, కె.రాజుపాలెం గ్రామాలలో పోలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కత్తెర పురుగు, లద్దె పురుగు ఉన్న దృష్ట్యా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో రైతులకు సూచించారు. వాన సూచన ఉండడంతో కోతను నాలుగురోజులు వాయిదా వేయాలన్నారు.

ఇంకొల్లు : శనగలో మొదలుకుళ్ల తెగులు నివారణకు ఎకరాకు 200 గ్రాముల కర్బండెజమ్, 600 గ్రాముల మంగోజెబ్‌ను పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. మండలంలోని పావులూరు, కొణికి గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, పశు సంవర్ధకశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : ఈ-పంట నమోదుతోనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజ్ అన్నారు. మండలంలోని బొమ్మనంపాడు, జార్లపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ గిట్టుబాటు ధరలు, ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీ రాయితీ, అన్నదాత సుఖీభవ తదితర పథకాల లబ్ధి కోసం ఈపంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఎస్. దీప్తి, వీఏఏలు ఆజాజ్, శంకర్, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : కంది మొగ్గ దశలో ఉన్నందున పురుగు సోకకుండా కాపాడుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలోని అనమనమూరు, యర్రబాలెం గ్రామాల్లో రైతులతో కలిసి కంది, శనగ పంటలను ఆయన పరిశీలించారు. కంది పూత, మొగ్గ దశలో ఉన్నప్పుడు వేప కషాయాన్ని పిచికారీ చేయాలని ఏవో సూచించారు. కార్యక్రమంలో ఏటీఎం రామిరెడ్డి, ఎంఎంసీ శ్రీనివాసరావు, వీఏఏలో హుప్రీన్, షరీఫ్, రైతులు పాల్గొన్నారు.

జీసీటీఏ ఎన్నికల్లో కేఆర్‌కే నుంచి నలుగురు ఎన్నిక



ఎన్నికైన అధ్యాకులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు

అద్దంకిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల అధ్యాపక సంఘం (జీసీటీఏ) ఎన్నికలలో రాష్ట్ర, జోనల్, జిల్లా స్థాయిలలో ఒకే కళాశాలల నలుగురు అధ్యాపకులు ప్రధాన హోదాలలో ఎన్నికవడం ఇదే ప్రథమం అని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు అన్నారు. సోమవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీసీటీఏ ఎన్నికలల్లో పదవులు పొందిన కళాశాల అధ్యాపకులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీసీటీఏ ఎన్నికలల్లో కెఆర్‌కె కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న డాక్టర్ చిలకా అనిత రాష్ట్ర మహిళ కార్యదర్శిగా, జోనల్ స్థాయిలో చల్లా ప్రసాద్, జిల్లా స్థాయిలో డాక్టర్ మహమ్మద్ నయీం, అశోక్ ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా సంఘంలో కీలక పదవులు పొందిన కళాశాలలోని నలుగురు అధ్యాపకులను ప్రిన్సిపాల్‌తో పాటు ఇతర అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సత్కరించి అభినందించారు. జీసీటీఏ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కలిసికట్టుగా పోరాడతామని తెలియజేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

పంగులూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుక ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేక్‌ను ఎంపీడీవో స్వరూపారాణి కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు మానవాళికి మేలు చేకూర్చుతాయన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, పీఆర్ ఏఈ హనుమంతరావు, ఏపీవో సంతోషమ్మ, జ్యోతిప్రసాద్, పంచాయతీ కార్యద ర్శులు రాంబాబు, సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, రామారావు, సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

దాబాలలో మద్యం అమ్మితే కేసులు

బల్లికురవ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఉన్న మిని రెస్టారెంట్లు, దాబాలలో మద్యం అమ్మకాలు చేపడితే కేసులు తప్పవని ఎస్‌ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. సోమవారం రాత్రి మండలంలోని మల్లాయపాలెం, వేమవరంలో ఉన్న లాడ్జీలు, దాబాలలో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. నిబంధనలను ఉల్లంఘించి మద్యం అమ్మకాలు చేపట్టినా, పేకాట ఆడినా చర్యలు తప్పవన్నారు.

డీజిల్ దొంగను పట్టుకున్న గ్రామస్థులు

బల్లికురవ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో మంగళవారం రాత్రి వాహనాల్లోని పెట్రోలు, డీజిల్‌ను చోరీ చేస్తున్న యువకుడిని గ్రామస్థులు పట్టుకున్నారు. ఇంటి ముందు ఉన్న ద్విచక్రవాహనాల నుంచి డబ్బాలోకి పెట్రోల్ తీస్తుండగా గమనించిన ప్రజలు వెంటనే ఆ యువకుడిని పట్టుకున్నారు. విచారించగా పలు రకాలుగా సమాధానం చెప్పడంతో అనుమానం వచ్చి యువకుడిని చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. ఇటీవల తరచూ డీజిల్, పెట్రోల్ చోరీలు జరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్లు పయనం

తుమ్మపాల (అనకాపల్లి జిల్లా), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న 68వ జాతీయ స్కూల్‌గేమ్స్ ఖోఖో చాంపియన్‌షిప్ అండర్-19 పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలురు, బాలికల జట్లు మంగళవారం అనకాపల్లి నుంచి బయలుదేరాయి. ఈ సందర్భంగా క్రీడాకారులకు అనకాపల్లి మండలం తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యా శాఖాధికారి జి.అప్పారావునాయుడు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

బాలుర జట్టు

జి.అజయ్ (విశాఖ), బి.సాయి (విశాఖ), సీహెచ్.చరణ్ (విశాఖ), డి.వినయ్ (ప్రకాశం), పి.నరేష్ (ప్రకాశం), డి.రాకేశ్ (కృష్ణా), ఎం.శివ (విజయనగరం), బి.తిరుమల (శ్రీకాకుళం), ఇ.శేషనార్‌గౌడ్ (అనంతపురం), ఎస్.నవీన్ (నెల్లూరు), జె.యల్లప్ప (కర్నూలు), బి.పవన్ (చిత్తూరు).

బాలికల జట్టు

కె.లాస్య (విశాఖ), పి.జోత్స్న (విశాఖ), జె.గీత (విశాఖ), సీహెచ్.లావణ్య (విజయనగరం), బి.భార్గవి (నెల్లూరు), కె.పవిత్ర(నెల్లూరు), డి.రంగమహాలక్ష్మి(గుంటూరు), కె.దివ్య (పశ్చిమగోదావరి), ఎస్.హస్మిత (చిత్తూరు), జి.దేవి (కడప), జి.భవాని (శ్రీకాకుళం), బి.కల్యాణి (ప్రకాశం). బాలికల జట్టు కోచ్‌గా కేఎం నాయుడు, మేనేజర్‌గా పి.లక్ష్మి వ్యవహరించనున్నారు.

భూ సమస్యలకు పరిష్కారం

ఆర్డీవో చంద్రశేఖరనాయుడు

పంగులూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను రైతులు పరిష్కరించుకోవాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు కోరారు. మండలంలోని బూదవాడ, మల్లవరం గ్రామాలలో మంగళవారం తహసీల్దార్ సింగారావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులో తమ దృష్టికి తెచ్చిన సమస్యలకు నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చూపాలన్నారు. ఈ సదస్సులలో భూమి కొలతలకు సంబంధించి 3, ఆర్వోఆర్‌కు సంబంధించి 12 దరఖాస్తులు అందగా, అందులో 3 పరిష్కరించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ సురేష్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

కన్వర్షన్ భూముల పరిశీలన

రైతులు కన్వర్షన్ కోరిన భూములను ఆర్డీవో చంద్రశేఖరనాయుడు పరిశీలించారు. మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో ఎస్‌ఎస్ పౌల్ట్రీ ఫామ్స్‌కు సంబంధించి చేబ్రోలు ఆదినారాయణ భూములతో పాటు, బైటమంజులూరు గ్రామ సరిహద్దులో 16వ నెంబరు జాతీయ రహదారి పక్కన పెట్రోలు బంకు ఏర్పాటు కోసం కన్వర్షన్ కోరిన భూమిని ఆర్డీవో పరిశీలించారు. అనంతరం చందలూరు బీసీ కాలనీలో తమకు నివేశన స్థలాలు ఇవ్వాలని కోరుతూ గ్రామస్థులు దరఖాస్తు చేసుకోగా, ఆ భూమిని ఆర్డీవో పరిశీలించారు. ఆయనవెంట తహసీల్దార్, సర్వేయర్‌లు ఉన్నారు.



బూదవాడలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖరనాయుడు

బల్లికురవ : రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కారం చూపేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ రవినాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అంబడిపూడి గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యల గు రించి తహసీల్దార్‌కు అర్జీలను సమర్పించా రు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భూముల రీ-సర్వే పనులు మరలా ప్రా రంభం అవుతున్నాయని రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భూములపై హక్కులు ఉన్న అందరికీ రికార్డులలో నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సర్వేయర్ కిషోర్, గ్రామ పెద్దలు దద్దాల అంజయ్య పాల్గొన్నారు.

చినగంజాం : రెవెన్యూ సదసుల్లో స్వీకరించే ప్రతి అర్జీకి న్యాయమైన పరిష్కారం చూసిస్తామని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామానికి చెందిన విద్యార్థులు తమ కుల, ఆదాయ సర్టిఫికెట్స్ కోసం అర్జీలను ఇ చ్చినట్లు తహసీల్దార్ తెలి పారు. 40 మంది విద్యార్థులకు వెంటనే అవసరమైన ధ్రువపత్రాలను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మార్టూరు : నాగరాజుపల్లి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 26 అర్జీలు వచ్చాయి. వాటి లో భూసర్వే కోసం 6, పట్టాదారు పాస్ పుస్తకాలకు 3, ఇతరత్రా భూముల మార్పు పై 17 అర్జీలు వచ్చాయని తహసీల్దారు టీ ప్ర శాంతి తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రహమాన్ బాషా, సర్వేయర్ ఏడుకొండలు దేవదాయ శాఖ ఈవో శిరీష, రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

- మంత్రి రవికుమార్
- గత ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన సాగు నీటి రంగం
- అద్దంకి, పంగులూరు డీసీ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు ఏకగ్రీవం



అద్దంకి డీసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ధ్రువపత్రాలను అందుకుంటున్న శ్రీనివాసరావు,పేరయ్య, పంగులూరు డీసీ చైర్మన్‌గా ఎన్నికైన ఆంజనేయులు

అద్దంకి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే లక్ష్యంగా డీసీ కమిటీలు పనిచేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి నియోజకవర్గం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన అద్దంకి, పంగులూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌కు మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగు నీటి రంగం, సాగర్ కాలువలు పూర్తి నిర్లక్ష్యంకు గురైందన్నారు. సాగుదారులకు దన్నుగా పనిచేయాలన్నారు. కాల్వకట్టల ర క్షణ, బలోపేతం పనులు చేపట్టి దిగువ ఆయకట్టు కు నీటి సరఫరా సక్రమంగా జరిగేలా పనిచేయాలన్నారు.

అద్దంకి, పంగులూరు డీసీ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు ఏకగ్రీవం

అద్దంకి ఎన్‌ఎస్‌పీ కార్యాలయంలో మంగళవారం అద్దంకి డీసీ చైర్మన్‌గా ధర్మవరంకు చెందిన బండారుపల్లి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ గా బల్లికురవ మండలం కొత్తపాలెంకు చెందిన కోయ పేరయ్యను, పంగులూరు డీసీ చైర్మన్‌గా పంగులూరు మండలం ముప్పవరానికి చెందిన కుక్కపల్లి ఆంజనేయులు, వైస్ చైర్మన్‌గా అద్దంకి మండలం జార్లపాలెంకు చెందిన ధూళిపాళ్ల వీరాస్వామి లను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లను బల్లికురవ టీడీపీ నేతలు మలినేని గోవిందరావు, పావులూరి ఏడుకొండలు, ధూళిపాళ్ల హనుమంతరావు తదితరులు అభినందించారు.

చినగంజాం : మండలంలోని గొనసపూడి గ్రామానికి చెందిన పొద వీరయ్య చినగంజాం-52 డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. చీరాల ఇరిగేషన్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల అధికారి గుంటూరి మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మీ, అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఇరిగేషన్ శాఖ ఏ.ఈ ఏ.శ్రీధర్‌లు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో మండల పరిధిలోని ఆరు నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు కమిటీ చైర్మన్‌గా వీరయ్యను, వైస్ చైర్మన్‌గా జాగర్లమూడి సాయిప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వీరయ్య, సాయిప్రసాద్‌లకు ఎన్నికల అధికారి ధ్రువపత్రాలను అందజేశారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లుగా ఎన్నికైన వీరయ్య, సాయిప్రసాద్‌లకు పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుల అభినందనలు తెలిపారు. మండల పరిధిలోని టీడీపీ నాయకులు తూమాటి శ్రీనివాసరావు, వడ్లమూడి సత్యనారాయణ, సందు శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు, అబ్దుల్‌కలాంఅజాద్, కే.విష్ణు, మండల పరిధిలోని పలువురు నాయకులు వీరయ్యను పూలమాలలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



వీరయ్యకి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి విజయలక్ష్మి

మీనమేషాలు

- డీసీసీబీలో అక్రమాలపై ఉన్నత స్థాయిలో ఉదాసీనత
- కలెక్టర్ నివేదిక పంపి పక్షం దాటినా తదుపరి చర్యలు శూన్యం
- తొలి నుంచి ఉన్నతాధికారుల ధోరణి అలాగే
- ప్రభుత్వ తీరుపై సహకార వర్గాల్లో విమర్శలు

ఒంగోలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో అడ్డగోలుగా సాగిన అవినీతి, అక్రమాల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడంలో ఉన్నత స్థాయిలో ఉదాసీనత నెలకొంది. ప్రాథమికంగా చేపట్టిన విచారణలో అనేక అక్రమాలు జరిగినట్లు విచారణ కమిటీ తేల్చింది. ఆ నేపథ్యంలో సమగ్ర విచారణ కోరుతూ కలెక్టర్ తమీమ్ అన్సారియా పక్షం రోజుల క్రితం ప్రభుత్వానికి నివేదిక పంపినా తదుపరి చర్యలపై ఉన్నత స్థాయిలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. బ్యాంకు వ్యవహారంలో ప్రభుత్వ ఉన్నతాధికారుల ధోరణి తొలి నుంచి అలాగే ఉండగా విషయం ముఖ్యమంత్రి దృష్టికి చేరి సీఎంవో జోక్యం చేసుకోవడంతో కొంత కదిలిక వచ్చింది. తదుపరి చర్యలపై సాచివేత ధోరణిలోనే సహకారశాఖ ఉన్నతాధికారులు సాగుతున్నారన్న విమర్శలు సహకార వర్గాల్లో వ్యక్తం అవుతున్నాయి.

ఎమ్మెల్యే ఫిర్యాదు.. కలెక్టర్ లేఖ

జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఆ క్రమంలో అప్పటికి ఏడాది కాలంగా బ్యాంకు సీఈవోగా ఉన్న అధికారి అక్కడే కొనసాగితే రికార్డులు ట్యాంపరింగ్ అయ్యే అవకాశం ఉన్నందున ఆయనను మార్చడంతోపాటు సెక్షన్ 51 విచారణ బ్యాంకుపై వేయాలని అక్టోబరు 21న కలెక్టర్ అన్సారియా ప్రభుత్వానికి లేఖ రాశారు. సకాలంలో ఉన్నతాధికారులు స్పందించ లేదు. ఈ విషయాన్ని బహిర్గతం చేస్తూ నవంబరు 2న 'అక్కడ అంతే' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు కలవరపడ్డారు. అదే సమయంలో జిల్లాకు చెందిన టీడీపీ యువనేత ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో సీఎంవో ఆరా తీయడంతో పాటు ఉన్నతాధికారులకు తగు సూచనలు చేశారు.

త్రిసభ్య కమిటీతో విచారణ

ఈ నేపథ్యంలో సెక్షన్ 51 విచారణకు వీలుగా ప్రాథమిక పరిశీలన చేసి నివేదిక పంపాలని రాష్ట్ర సహకార శాఖ ఉన్నతాధికారుల నుంచి కలెక్టర్‌కు సమాచారం అందింది. డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీని కలెక్టర్ నియమించగా వారు లోతుగానే పరిశీలన చేశారు. మొత్తం 62 ఫిర్యాదులలో అత్యధికం వాస్తవమేనని గుర్తించి పక్షం రోజులపాటు విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు నెలాఖరులో వారు అందజేశారు. మరోవైపు సీఎం దృష్టికి వ్యవహారం వెళ్లిన తర్వాత ఇక్కడి బ్యాంకు పీఐసీ పాలకవర్గం సూచనలతో బ్యాంకు సీఈవోగా ఉన్న కోటిరెడ్డి రాజీనామా చేయగా ఆ స్థానంలో ఆప్కాబ్ నుంచి మరొక అధికారిని తాత్కాలికంగా నియమించారు. బ్యాంకు సిబ్బందిలోనూ కొన్ని మార్పులు జరిగాయి. అయితే ఈ మొత్తం వ్యవహారంలో బ్యాంకు పీఐసీ కమిటీగా ఉన్న కీలక అధికారులు కూడా తగు విధంగా వ్యవహరించలేదన్న విమర్శలు వచ్చాయి.

ఇంతవరకు చర్యల్లేవ్

ఇదిలాఉండగా లోకేశ్వరరావు కమిటీ ఇచ్చిన విచారణ నివేదికను పక్షంరోజుల క్రితమే కలెక్టర్ అన్సారియా ప్రభుత్వానికి పంపించారు. కాని ఇంతవరకు తదుపరి చర్యలు సహకార శాఖ ఉన్నతాధికారుల నుంచి కనిపించలేదు. తొలి నుంచి ఉన్నట్లుగానే ఆ శాఖ ఉన్నతాధికారులు ఉదాసీనంగానే వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుండగా, ఆ విషయాన్ని సంబంధిత మంత్రి దృష్టికి జిల్లాకు చెందిన అధికారపార్టీ ముఖ్య నేతలు ఇద్దరు, ముగ్గురు తీసుకెళ్లినట్లు తెలిసింది. అయినా తదుపరి ఆదేశాలు రాకపోవడంతో ఇలాంటి విచారణలు మనల్ని ఏమి చేస్తాయి, గతంలో ఎన్నో చూశాం అన్నట్లుగా బ్యాంకులో అక్రమార్కులు వ్యవహరిస్తుండగా పలు వర్గాల నుంచి ఇంకా కూడా విచారణాధికారి లోకేశ్వరరావుకు మరికొన్ని ఫిర్యాదులు అందుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, జిల్లాలోని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఇలాంటి వాటిపై సత్వర చర్యలవైపు దృష్టిసారించకపోతే ప్రజల్లో పాలకపక్షం అబాసుపాలు అయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

సంక్రాంతికి సాధ్యమేనా?

(5వ పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. పల్నాడు.. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2,153.50 కిలోమీటర్ల మేర రహదారుల్లో పనులకు రూ.113.99 కోట్ల నిధులను ప్రభు త్వం మంజూరు చేసింది. రహదారులను ప్యాకేజీలుగా విభజించి 456 పనులు చేపడితే ఇప్పటికి 19 పనులు మాత్రమే పూర్తయినట్లు ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ప్రగతి నివేదికలు తెలియజేస్తున్నాయి. పనులు నత్త నడకకన్నా నిదానంగా సాగుతున్నాయి. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో గుంతల రహదారులతో వాహనచోదకులు ఇక్కట్లు పడుతున్నారు. సంక్రాంతి కల్లా పనులు పూర్తి అవుతాయని ప్రభుత్వం ప్రకటించినా పురోగతి ఆ మేరకు కనిపించడం లేదు. మూడు జిల్లాల్లో కాస్తంత పల్నాడు జిల్లాలో పనులు పురోగతి కొంత మెరుగ్గా ఉంది. రహదారుల గుంతల పూడ్చివేతకు వారం వారం లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించినా ఆ మేర లక్ష్యాలను చేరుకోవడంతో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. పనుల్లో జరుగుతున్న జాప్యంతో రహదారుల ఇక్కట్లు ఇప్పట్లో వాహనదారులకు తీరే పరిస్థితులు కానరావడం లేదు. పురోగతిని పరిశీలిస్తే ప్రభుత్వం ప్రకటించినట్లుగా సంక్రాంతికి పూర్తి అయ్యే పరిస్థితులు లేవని చెప్పవచ్చు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో కూడా రహదారులపై గుంతల పూడ్చివేతపై చర్చ జరిగింది. వేగవంతంగా పనులు పూర్తి చేసి రహదారుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.

స్నాతకోత్సాహం

(5వ పేజీ తరువాయి)

డిగ్రీలను ప్రదానం చేశారు. ఎయిమ్స్ మంగళగిరి సెంటర్ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ బ్రోచర్‌ను కేంద్ర సహాయమంత్రి జాదవ్ ఆవిష్కరించారు.

47 మందిలో 17 మంది మహిళలే

ఎయిమ్స్‌లో డిగ్రీలు తీసుకున్న 47 మందిలో 17 మంది మహిళలే. దీనిపై రాష్ట్రపతి ముర్ము హర్షం వ్యక్తం చేశారు. వైద్యవృత్తిలో పెరుగుతున్న మహిళల భాగస్వామ్యంతోపాటు వారి గణనీయమైన సహకారాన్ని చూస్తూ ఉంటే అభివృద్ధి చెందుతున్న సమాజంగా మారుతున్నట్లు అనిపిస్తోందన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌కు మొదటి బ్యాచ్ విద్యార్థులే బ్రాండ్ అంబాసిడర్లన్నారు. తన ప్రసంగంలో ముందుగా ఆమె మంగళగిరి క్షేత్రాన్ని గురించి ప్రస్తావించి వేదికపై నుంచే పానకాలస్వామికి నమస్కారాలను తెలిపారు. నరసింహస్వామి చెంత వైద్యవిద్యను అభ్యసించిన విద్యార్థులందరూ ఎంతో అదృష్టవంతులన్నారు. వైద్యులు సేవకు ప్రాధాన్యమివ్వాలని, యువ వైద్యులు మరింత చిత్తశుద్ధితో వ్యవహరించాలని తెలిపారు. ప్రజలు పూర్తిస్థాయి ఆరోగ్యవంతులుగా ఉండాలని.. అందుకోసం ప్రతి ఒక్కరూ తమతమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు.

దేశ భవిష్యత్ నగరంగా అమరావతి : చంద్రబాబు

దేశ భవిష్యత్ నగరాల్లో ఏపీ రాజధాని అమరావతి ప్రముఖంగా నిలువబోతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. దేశంలోని ఎయిమ్స్‌లన్నింటిలోనూ రాజధాని అమరావతి పరిధిలోని మంగళగిరి ఎయిమ్స్ నెంబర్‌వన్‌గా నిలుస్తుందన్న నమ్మకం తనకుందని చెప్పారు. మంగళగిరి ఎయిమ్స్‌లో ఇకమీదట ఎలాంటి మౌలిక సదుపాయాలకు లోటు రానివ్వబోమని హామీ ఇచ్చారు. దేశంలోని ఏ ఎయిమ్స్‌లో కూడా ఇంత సుందరమైన, ఆహ్లాదకరమైన వాతావరణం లేదన్నారు. ముర్ము సామాన్య ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చి దేశ అత్యున్నత పదవిని సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. కష్టపడితే ఈ ప్రపంచంలో సాధించలేనిది ఏదీ లేదనడానికి ద్రౌపదిముర్ము జీవితమే ఒక ఉదాహరణ అని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రపతి ద్రౌపదిముర్మును శాలువతో సన్మానించి తిరుమల శ్రీవారి మెమొంటోను అందజేశారు. రాష్ట్రపతికి మంగళగిరి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి నారా లోకేశ్ మంగళగిరి చేనేత చీరెను బహూకరించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ మదబానందకర్, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూపులు

- మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్న ప్రజానీకం
- సంక్రాంతికి కొత్తవి ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- దరఖాస్తులు చేసుకోనేందుకు ఓపెన్ కానీ సైట్
- అయోమయంలో అర్హులైన పేదలు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా తెల్లరేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న అర్హులైన పేదలకు నిరాశే మిగిలింది. ప్రభుత్వం సంక్రాంతికి కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించడంతో వారిలో ఆశలు చిగురించాయి. అయితే సైట్ ఓపెన్ కాకపోవడంతో అందరు ఎదురుచూస్తున్నారు. ఈనెల 2 నుంచి మీసేవ, వార్డు, గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించి వాటిపై విచారణ చేసి అర్హులైన వారందరికి రేషన్ కార్డులు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో కార్డుదారులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే కార్డుల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు మీసేవ కేంద్రాలు, సచివాలయాలకు వెళ్లగా అక్కడ నిరాశే ఎదురవుతోంది. ఇప్పటికే కొత్త వాటితోపాటు ఉన్న రేషన్ కార్డుల్లో పేర్లు మార్పులతో పాటు వివిధ కారణాల వల్ల పేర్లు తొలగింపు చేయకపోవడంతో వేలాదిమంది ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సైట్ ఓపెన్ కావడం లేదు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రేషన్ కార్డులపై ప్రత్యేక దృష్టిసారించారు. అందులోభాగంగా కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రస్థాయి అధికారులు కూడా తదనుగుణ చర్యలు చేపట్టారు. తీరా ఇప్పుడు దరఖాస్తులు చేసుకునేందుకు వెళితే అక్కడ సైట్ (పౌరసరఫరాల శాఖకు సంబంధించినది) ఓపెన్ కాకపోవడంతో దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం లేకుండాపోయింది. ఏదైనా టెక్నికల్ సమస్యతో ఓపెన్ కాలేదని ఎదురుచూసిన ప్రజానీకం ఇప్పుడు అధికారులను కలిసి సమస్యను విన్నవిస్తున్నారు. కొత్త రేషన్‌కార్డుల కోసం గ్రీవెన్స్ సెల్‌లో కూడా అర్జీలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయిలోనే టెక్నికల్ సమస్య ఏర్పడి వాయిదాపడిన విషయాన్ని కూడా సంబంధిత అధికారులకు తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వెంటనే కొత్త రేషన్‌కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నారు.

డ్వామాలో శీనారెడ్డి రగడ

- నిబంధనలకు విరుద్ధంగా పలు ఫైళ్ల నకళ్లు తీసుకెళ్లిన వైనం
- సహకరించిన కార్యాలయ సిబ్బందిపై పీడీ జోసఫ్‌కుమార్ ఆగ్రహం

ఒంగోలు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలుగున్నరేళ్ల పాటు జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పీడీగా పనిచేసిన శీనారెడ్డి ఆ సమయంలో ఇష్టారీతిగా వ్యవహరించారు. బదిలీలు, నియామకాలు, పనుల మంజూరు, సోషల్ ఆడిట్, చివరకు వాహనాల బిల్లులలో సైతం భారీగా స్వాహా చేశాడన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. అందుకు సంబంధించి ప్రభుత్వానికి అందిన ఫిర్యాదుతో ప్రస్తుతం తొలుత విజిలెన్స్ విచారణ, తర్వాత ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ నియమించిన డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ విచారణ కొనసాగుతోంది. ఇలాంటి విచారణలలో దిట్టగా పేరున్న లోకేశ్వరరావు కొంత లోతుగానే పరిశీలన చేపట్టగా ఇప్పటికే కొన్ని అంశాలలో అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు కమిటీ గుర్తించింది. ఈక్రమంలో ఆయా ఫిర్యాదులపై శీనారెడ్డిని కూడా విచారించాలని త్రిసభ్య కమిటీ భావించి ఈనెల 14వతేదీన తమ కమిటీ ఎదుట హాజరుకావాలని తొలుత శీనారెడ్డికి నోటీసు ఇచ్చారు. అయితే విచారణ కమిటీ ముందు హాజరై తన వివరణ ఇచ్చేందుకు కొన్ని అంశాలకు సంబంధించిన మెటీరియల్ సేకరించుకోవాల్సి ఉందని, వారం గడువు ఇవ్వాలని సమాధానం ఇచ్చినట్లు సమాచారం.

అల్పపీడన ప్రభావం.. రైతులలో టెన్షన్

- చల్లబడిన వాతావరణం
- నేడు, రేపు వానలు కురిసే అవకాశం
- ఇటీవలి తుఫాన్‌కు దెబ్బతిన్న పొగాకు, శనగ
- మళ్లీ కురిస్తే అంతా నష్టమే

ఒంగోలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జిల్లాపై ఉంటుందన్న సమాచారంతో జిల్లా రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈనెల తొలి వారంలో తెరపి లేకుండా వారంరోజుల పాటు విస్తారంగా వర్షాలు కురవగా, జిల్లా తూర్పు, దక్షిణ ప్రాంతాల్లోని మండలాల్లో పొగాకు, శనగ పైర్లు దెబ్బతిన్నాయి. ఆ రెండుతోపాటు మినుము, వరి, మిర్చి, అలసంద ఇలా పలు రకాల పంటలు ఇంచుమించు లక్ష ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఏదో ఒక స్థాయిలో దెబ్బతిన్నాయి. అంతేకాక మిగిలిన రబీ పంటలు సాగు కూడా జాప్యమైంది. దాని నుంచి తేరుకొని భూములు దున్ని పంటలు వేయాలని సిద్ధం అవుతున్న రైతులకు తాజాగా మరో అల్పపీడనం అన్న సమాచారం కంటి మీద కునుక లేకుండా చేస్తోంది. వాతావరణ శాఖ తాజా సమాచారం ప్రకారం అగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా వాయుగుండం గా మారి తమిళనాడు తీరం వైపు పయనిస్తోంది. దీని ప్రభావం తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో ఉండనుండగా జిల్లాపైనా ఉంటుందని సమాచారం. జిల్లాలో దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దానికి అనుగుణంగా జిల్లాలో ప్రత్యేకించి తూర్పు, దక్షిణ ప్రాంతాలలో మంగళవారం వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఒంగోలులో సోమవారం 30 డిగ్రీలుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రత ఉండగా మంగళవారం నాలుగు డిగ్రీలు తగ్గింది. ఇదే పరిస్థితి ఇతరచోట్ల కనిపిస్తుండటంతోపాటు చలి కూడా పెరిగింది. ఈ తరహా వాతావరణంతో పంటలపై తెగుళ్లు, పురుగుల దాడి మరింత పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో ఇటీవలి వర్షాల నష్టాల నుంచి ఇంకా తేరుకోక ముందే మరోసారి వర్షాల సమాచారంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

గ్రానైట్ రాయి లారీ పట్టివేత

బల్లికురవ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీర్ల కొండ నుంచి పర్మిట్ లేకుండా కటింగ్ ఫ్యాక్టరీలకు తరలిపోతున్న గ్రానైట్ ముడి రాయి లారీని సోమవారం రాత్రి బాపట్ల మైనింగ్ ఏడీ రాజేష్‌బాబు పట్టుకొన్నారు. అనంతరం ఆ లారీని బల్లికురవ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. గత రెండు రోజుల వ్యవధిలోనే పర్మిట్లు లేని ఏడు లారీలను అధికారులు పట్టుకున్నారు.

నేటి నుంచి రెండో విడత శిక్షణ

పంగులూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన అంశాలపై బుధ, గురు వారాలలో రెండవ విడత శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. ఫిఫ్త్ గ్రేడ్ కార్యదర్శులు, డిజిటల్, విలేజ్ హార్టికల్చరల్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వీఆర్‌వోలు, ఏఎస్ఎంలు, మండల స్థాయి అధికారులు ఈ శిక్షణకు హాజరు కావలసిందిగా ఎంపీడీవో కోరారు. మండల విద్యా వనరుల కేంద్రంలో ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

మెగా ఆర్వో ప్లాంట్ పూర్తయ్యేనా?

» నిర్మాణం కాకుండానే అటకెక్కిన వైనం

» ప్రత్యామ్నాయ అవసరాలకైనా వినియోగించాలంటున్న ప్రజలు

అద్దంకి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి, బల్లికురవ మండలాలలో 22 గ్రామాలకు తక్కువ ధరకు శుభ్రమైన జలం అందించేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వం శింగరకొండ వద్ద మెగా ఆర్‌వో ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు జరిగే సమయంలో 2019 ఎన్నికలలో వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో ఐదున్నర సంవత్సరాలుగా పనులు అడుగు ముందుకు పడలేదు. భవనాసి చెరువులో ఏర్పాటు చేసిన ఇన్‌టెక్‌వెల్, శింగరకొండ వద్ద నిర్మించిన వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారాయి. మెగా ఆర్వో ప్లాంట్ నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వచ్చి ఉంటే రెండు రూపాయలకే 20లీటర్ల నీరు ఇళ్ల వద్దకే సరఫరా జరిగేవి. ప్రస్తుతం ఆయా గ్రామాలలో ప్రైవేటు వ్యక్తులు ఆర్‌వో ప్లాంట్‌లను ఏర్పాటు చేసినప్పటికీ 20లీటర్ల నీరు 10 నుంచి 20 రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అసంపూర్తిగా నిలిచిపోయిన మెగా ఆర్వో ప్లాంట్‌ను త్వరిత గతిన పూర్తిచేయాలని, ఒక వేళ దానిని ప్రస్తుతం ఏర్పాటు చేసే ఆలోచన లేకపోతే కనీసం ఆయా ట్యాంక్‌లను వినియోగంలోకి తీసుకువచ్చి శింగరకొండ, శింగరకొండ పాలెం, గోపాలపురం, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు మంచి నీటి సరఫరాకు వినియోగించేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



భవనాసి చెరువులో ఏర్పాటు చేసిన ఇన్‌టెక్‌వెల్



శింగరకొండ వద్ద అసంపూర్తిగా ఉన్న వాటర్ ట్యాంక్

12 మంది మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

మార్టూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎఫర్ట్ కార్యాలయంలో మంగళవారం రాత్రి బీజీఆర్ మైనింగ్ అండ్ ఇన్‌ఫ్రా హైదరాబాదు వారి ఆర్థిక సహకారంతో రోటరీ క్లబ్ వారు 12 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు, రావి అంకమ్మచౌదరి,చెన్నుపాటి బసవరాములు, ఇంటూరి ఆంజనేయులు,శానంపూడి లక్ష్మయ్య, యూ కోటేశ్వరరావు, షేక్ కాజా హుస్సేన్, కొర్రపాటి వేణు, మాదాల సాంబయ్య పాల్గొన్నారు.

కోనంకి డీసీ అధ్యక్ష,ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవం



కోనంకిలో ఎన్నికైన డీసీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో టీడీపీ నాయకులు

మార్టూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కోనంకి సబ్ డివిజన్ ఎన్ఎస్పీపరిధిలో కోనంకి, పర్చూరు, ఇంకొల్లు, ద్రోణాదుల డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్ష పదవులకు మంగళవారం కోనంకి ఎన్నెస్పీ కార్యాలయంలో ఎన్నిక జరిగింది. కార్యక్రమానికి బాపట్ల డీడబ్ల్యూఆర్వో అబుత్ అలీం ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వారికి అబుత్‌అలీం, అద్దంకి ఈఈ నాగమురళి, డీఈ స్వామి చేతులమీదుగా నియామకపత్రాలను అందచేశారు. వారిలో కోనంకి 39 డిస్ట్రిబ్యూషన్ కంట్రిబ్యూషన్ అధ్యక్షుడిగా ఉప్పలపాటి చక్రపాణి, ఉపాధ్యక్షుడిగా తాటి ఆంజనేయ స్వామి, ద్రోణాదుల 41 డీసీ అధ్యక్షుడిగా కొసరాజు దిలీప్ కుమార్ ఉపాధ్యక్షుడిగా పఠాన్ మహబూబ్ ఖాన్, పర్చూరు 42 డీసీ అధ్యక్షుడిగా కొల్లా మురళీకృష్ణ, ఉపాధ్యక్షునిగా ముప్పా ఆంజనేయులు, ఇంకొల్లు 40 డీసీ అధ్యక్షుడిగా బండ్ల శ్రీనివాసరావుఉపాధ్యక్షుడిగా గుడి మల్లికార్జునరావు ఎన్నికయ్యారు. వారందరికీ అధికారులు నియామక పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు అనూరాధ, శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు వ్యవహరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కోటపాటి సురేష్, తాటి నాగేశ్వరరావు, తాటి నాగార్జున, కోలలపూడి సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, పెంట్యాల శ్రీను, కరణం మారుతి, ఉప్పలపాటి నాగేంద్రమ్మ పాల్గొన్నారు. అదేవిధంగా కృష్ణా వెస్ట్రన్ డెల్టా పరిధిలో చీరాల 51 డీసీ చైర్మన్‌గా స్వర్ణకు చెందిన నీరుకట్టు పాండురంగారావు, వైస్ చైర్మన్‌గా నక్కల నాగరాజు, చిన గంజాం 52 డీసీ చైర్మన్‌గా గొనసపూడికి చెందిన పొదవీరయ్య, వైస్ చైర్మన్‌గా జాగర్లమూడి సాయి ప్రసాద్ ఎన్నికయ్యారు.

కోనంకి డీసీ అధ్యక్షునిగా రెండో సారి చక్రపాణి నియామకం



కోనంకి డీసీ అధ్యక్షుడు చక్రపాణి

కోనంకి డీసీ కమిటీ అధ్యక్షుడిగా ఉప్పలపాటి చక్రపాణి రెండో సారి బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2014-19 కాలంలో డీసీ అధ్యక్షులుగా పని చేశారు. అదేవిధంగా 1997 నుంచి కోనంకి నీటి సంఘం అధ్యక్షులుగా ఉన్నారు. ప్రస్తుతం కోనంకి 2 నుంచి నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై డీసీ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. అతనిని లీలా కృష్ణ మూర్తి, జరుగుల సాంబయ్య, గ్రామస్థులు అభినందించారు.

డీసీ చైర్మన్‌గా మురళీకృష్ణ



నియామక పత్రాన్ని అందుకుంటున్న మురళీకృష్ణ

పర్చూరు : సాగు నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు హవా కొనసాగింది. నియోజకవర్గంలో అన్ని డీసీల్లో విజయం సాధించారు. మంగళవారం డీసీ కమిటీలకు నిర్వహించిన ఎన్నికల్లో పర్చూరు 42 డీసీ చైర్మన్‌గా కొల్లా మురళీకృష్ణ, వైస్ చైర్మన్‌గా ముప్పా ఆంజనేయులు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులను ఎమ్మెల్యే ఏలూరి అభినందించారు. కార్యక్రమంలో కొ ల్లా శ్రీనివాసరావు (ఫ్యాక్టరీ), డీసీ మాజీ చైర్మన్ పాలేరు సుబ్బయ్య, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సాగు నీటి సమస్యతో ఇబ్బంది పడకూడదు

ఎమ్మెల్యే ఏలూరి .. డీసీ కమిటీ చైర్మన్‌లకు అభినందనలు

ఆయకట్టు చివరి భూములకు కూడా నీరు అందేవిధంగా చూడాలని, రైతులకు సాగు నీటి కోసం ఇబ్బందులు పడకుండా చూడాలని నూతనంగా ఎన్నికైన డీసీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కోరారు. మంగళవారం జరిగిన డీసీ కమిటీ చైర్మన్ లు, వైస్ చైర్మన్‌ల ఎన్నికలో కోనంకి ఎన్ఎస్పీ పరిధిలోని 4 డీసీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు, కృష్ణా వెస్ట్రన్ డెల్టా పరిధిలోని 2 డీసీ చైర్మన్‌లు తెలుగుదేశం పార్టీ మద్దతు దారులు కైవసం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వారిని అభినందించారు. అనంతరం సాగర్ కాలువల ఆధునికీకరణ డీసీ కమిటీ చైర్మన్‌లు కృషి చేయాలని సూచించారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా కమిటీ చైర్మన్‌లు పనిచేయాలన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న అధికారులు

చీరాలటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో మౌలి క వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీరాజ్ డైరెక్టర్ కేశవరెడ్డి, డీఎల్‌డీవో పద్మావతి, తహసీల్దార్ గోపీకృష్ణ పేర్కొన్నారు. గత రెండు రోజులుగా చీరాల మండల కార్యాలయంలో పంచాయతీ కార్యాలయ అన్ని ప్రభుత్వ విభాగాలకు ఎంపీడీవో శివ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆరోగ్య వంతమైన గ్రామం, బాల హిత పంచాయతీలు, నీటి సమృద్ధి గల గ్రా మం, పరిశుభ్రమైన, స్వచ్ఛమైన గ్రామం, స్వయం సమృద్ధితో సదుపాయాల గ్రామం, సామాజిక న్యాయం, భద్రత, సుపరి పాలన కలిగిన గ్రామం అంశాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా సంబంధిత శిక్షణపై సిబ్బందికి రాత పరీక్ష కూడా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రామకృష్ణ, ఏపీఎం మధు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ డే

చీరాలటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చీరాలలో మంగళవారం ఘనంగా పెన్షనర్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భం గా ఎస్‌జే రంగనాయకులు బాపనమ్మ క ల్యాణ మండపంలో సుమారు 350 మంది పెన్షనర్స్ పాల్గొన్నారు. ముందుగా డిస్ నకార చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుమారు 40 మంది సీనియర్స్‌ను ఎస్టీవో సుబ్బారావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు కోడూరి ఏకాంబరేశ్వర బాబు, బత్తుల బ్రహ్మారెడ్డి, సిద్దయ్య, బ్రహ్మం, భాగి కృష్ణమూర్తి పాల్గొన్నారు. విజ్ఞాన భారతి పాఠశాలలో నిర్వహించిన పెన్షనర్స్ డే వేడుకలను ఆర్‌సీటీఏ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పలువురు సీనియర్ పెన్షనర్స్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వెంకటరావు, రోశయ్యగంగాధర్‌రావు, రవీంద్రకుమార్, గిరిజాశంకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.



పాఠశాలకు క్యాన్లు, గ్లాసులను అందజేస్తున్న దాత

దాతల సాయం అభినందనీయం

చినగంజాం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని పాఠశాల హెచ్‌ఎం డి.రత్నకుమారి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తాగనీటి కోసం క్యాన్లు, గ్లాస్లులను దాత అక్కల రామకృష్ణారెడ్డి పాఠశాల హెచ్‌ఎంకు మంగళవారం అందజేశారు. దాతల సాయాన్ని విద్యార్థులు వినియోగించుకొని విద్యాభివృద్ధి చెందాలని హెచ్‌ఎం అన్నారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు అక్కల రామకృష్ణారెడ్డి విద్యార్థుల తాగునీటి సౌకర్యార్థం కోసం నాలుగు వాటర్ క్యాన్లు, గ్లాసులు పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు కుర్రి రామసుబ్బారావు, ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, శ్రీనివాసదీక్షితులు, సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు

గ్రామాల్లో ఆధార్ మొబైల్ శిబిరాలు

చినగంజాం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో 0-6 సంవత్సరాలలోపు చిన్నారులకు ఆధార్ నమోదు కోసం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తల సహకారంతో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు, 26 నుంచి 28వ తేదీ వరకు ఆధార్ మొబైల్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి తెలిపారు. సంతరావూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో జరిగే ఆధార్ శిబిరాలకు సంతరావూరు, గొనసపూడి గ్రామాలు, కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 18, 19 తేదీల్లో కడవకుదురు, చింతగుంపల్లి గ్రామాలు, చినగంజాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 19, 20న చినగంజాం, పల్లెపాలెం గ్రామాలు, 20, 21న పెదగంజాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పెదగంజాం, పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు, 26, 27న రాజుబంగారుపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాజుబంగారుపాలెం, కొత్తపాలెం గ్రామాలు, 27, 28న మోటుపల్లి, మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలు, 28వ తేదీన మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మున్నంవారిపాలెం, నీలాయపాలెం గ్రామాలకు ఆధార్ శిబిరాల ఇన్‌చార్జిలు ఎస్.సురేష్, ఎ.మనీష్‌కుమార్ ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఎంపీడీవో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఆధార్ శిబిరాలు జరుగుతున్నప్పుడు ఆధార్ ఆపరేటర్లు, ఇద్దరు సచివాల సిబ్బందిని కేటాయించాలని, ముందు రోజు గ్రామాల్లో దండోరా, ఇతర ప్రచార సాధనాల ద్వారా ప్రచారం చేయించాలని గ్రామ కార్యదర్శులను ఎంపీడీవో ఆదేశించారు.

పెళ్లయిన ఆరు నెలలకే నూరేళ్లు నిండాయి

» అనుమానాస్పదంగా స్వర్ణకు చెందిన వ్యక్తి మృతి

» కూలి పనులకు వెళ్లి అనంతలోకాలకు



కల్యాణ్‌బాబు (ఫైల్)

చీరాలటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి అయన ఆరు నెలలకే ఓ వ్యక్తికి నిండు నూరేళ్లు నిండాయి. పని ముగించుకుని పెందలకడనే తిరిగి వస్తానని భార్యకు చెప్పి వెళ్లి అనంత లోకాలకు చేరాడు. ఈమృతిపై అనేక సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. కారంచేడు మండలం స్వర్ణ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన కూరపాటి కల్యాణ్‌బాబు(26) కుటుంబంలో ఒక్కగానొక్క కుమారుడు. మిగిలిన ఇద్దరు ఆడపిల్లలు. ఇతనికి ఈ ఏడాది జూన్ 24న బాపట్ల మండలం పేరలిగ్రామానికి చెందిన మేరమ్మతో వివాహం జరిగింది. తండ్రి సంసోన్, మరి కొందరు గ్రామస్థులతో కలిసి రోజు రైలు మార్గంలో తెనాలిలో వ్యవసాయ పనులకు వెళుతున్నాడు. గత ఆదివారం పనికి వెళ్లగా, మేము తర్వాత వస్తామని చెప్పడంతో తండ్రి కొందరితో కలిసి సర్కార్ రైలులో ఇంటికి వచ్చారు. ఆ రాత్రి కల్యాణ్ తప్ప మిగతా మిత్రులంతా ఇంటికి చేరారు. చీరాల రైల్వే స్టేషన్‌లో ఉన్న కల్యాణ్ ద్విచక్ర వాహనాన్ని ఒక మిత్రుడు తీసుకువచ్చి ఇంటి వద్ద పెట్టి వెళ్లి పోయాడు. ఆసమయంలో తమ కుమారుడు ఎక్కడని అడగగా తమకు తెలియదని సమాధానమిచ్చారు. కల్యాణ్ రెండోరోజు సోమవారం ఉదయం ఈపూరుపాలెం సమీపంలో పట్టాలపై శవమై కన్పించాడు. రైల్వే పోలీసులు మంగళవారం చీరాల ఏరియా వైద్యశాలలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కు టుంబ సభ్యులకు అప్పగించారు.

హాస్పిటల్‌కు రాని సహచరులు

రెండు రోజులుగా హాస్పిటల్లో మృతదేహం ఉన్నా కల్యాణ్‌తో ఉన్న సహచరులెవరూ హాస్పిటల్ చుట్టు పక్కలకు రాక పోవడంపై తండ్రి సంసోన్ కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై న్యాయ పరమైన విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బాలుడుకి గాయాలు

అద్దంకి, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంకుపాడు లో సైకిల్ పై వెళ్తున్న బాలు డు ని టిప్పర్ ఢీ కొనటం తో గాయాలు అయిన సంఘటన పై మంగళవారం అద్దంకి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని కుంకుపాడు కు చెందిన అంబటి మనోజ్ అద్దంకి లోని ఓ ప్రవేట్ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం కుంకుపాడు లోని గంగవరం రోడ్డు లో సైకిల్ పై వెళ్తుండగా టిప్పర్ ఢీ కొట్టింది. గాయాలైన మనోజ్ ను ఒంగోలు వైద్యశాలకు తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. ఒంగోలు హాస్పటల్ నుండి వచ్చిన సమాచారం మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఖాదర్ బాషా తెలిపారు.

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి

యద్దనపూడి, (మార్టూరు) డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్ వెంకయ్య (55) గుండెపోటుతో మంగళవారం వేకువజామున మృతి చెందారు. అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బల్లికురవ మండలం కొప్పెరపాడు స్వగ్రామం. సోమవారం రాత్రి మార్టూరులో కుమార్తె ఇంటిలో ఉన్న అతను తెల్లవారుజామున రెండు గంటల సమయంలో గుండెపోటుకు గురికాగా ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మృతి చెందారు. ఎంపీడీవో షేక్ మహమ్మద్ అబీబ్ జావెద్ సిబ్బందితో వెళ్లి కొప్పెరపాడులో కుటుంబసభ్యులకు మట్టిఖర్చులు నిమిత్తం 25 వేల రూపాయలను అందచేశారు.

'పది'లో మంచి మార్కులు సాధించాలి

అద్దంకిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం, దాతల చేయూతను విద్యార్థులు అందిపుచ్చుకుని పదవతరగతి పబ్లిక్ పరీక్షలల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని ఎంఈవో బి.సుధాకరరావు అన్నారు. మంగళవారం యూటీఎఫ్ అద్దంకి మండల శాఖ అధ్వర్యంలో పట్టణంలోని గురకాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం హెచ్ఎం ఎల్.సుజాత అధ్యక్షతన జరిగింది. గతేడాది యూటీఎఫ్ పంపిణీ చేసిన మెటీరియల్ 80శాతం మందికి ఉపయోగపడిందన్నారు. అనంతరం ఎంఈవో స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు ఏ.సుధాకర్, ఎంకే శర్మ, సునీత, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో సుధాకరరావు